RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 267 మేడ్చల్ మల్కాజ్‌గిరి 20 అక్టోబర్ 2024 ఆదివారం పేజీలు : 4

## ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం..

ఢిల్లీ వాసులకు దీపావళికి ముందే కష్టకాలం మొదలైంది. ప్రతి ఏడాది చలికాలంలో ఢిల్లీ వాసులు తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు పడుతుంటారు. అయితే ఈ ఏడాది మరింత ముందుగానే ఢిల్లీలో వాయు కాలుష్యం పెరిగిపోయింది. దీపావళి పండుగకు ముందే ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ తక్కువగా ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. తాజాగా ఢిల్లీలోని ఆనంద్ విహార్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 334గా నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది చలి తీవ్రత పెరగడం, వాయు వేగం తగ్గడంతో ఢిల్లీ, చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి తగ్గిపోతోంది. పంజాబ్, హర్యానాలో పంట వ్యర్థాల దహనం వల్ల రాజధాని నగరం ఢిల్లీని పొగ అలిమేస్తోంది. దీంతో రాజధాని ప్రాంత ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు.

# అక్రమార్కులే 'హైడ్రా'కు భయపడేది!

## ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి

## కేసీఆర్ కుటుంబానిది దోపిడీ చరిత్ర!!




హైదరాబాద్: నాలాలు, చెరువులను ఆక్రమించుకున్న వారే హైడ్రాను చూసి భయపడుతున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చార్మినార్ వద్ద నిర్వహించిన రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "హైడ్రాను చూపి రియల్ ఎస్టేట్‌ను దెబ్బతీయాలని కొంతమంది చూస్తున్నారు. అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావుకు ఫాంహౌస్ లేదా? గతంలో కాంగ్రెస్ వల్లనే హరీశ్‌రావుకు మంత్రి పదవి వచ్చింది. కేసీఆర్ కుటుంబానికి దోపిడీ చరిత్ర ఉంది. తెలంగాణ ఆర్థిక మూలాలు దెబ్బతీయాలని చూస్తున్నారు " అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గీతారెడ్డికి సద్భావనా అవార్డును సీఎం ప్రదానం చేశారు. గీతారెడ్డికి ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. "దేశ సమగ్రత కోసం 34 ఏళ్ల క్రితం రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర చేపట్టారు. ఏటా వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకు వెళ్తున్నాం. సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలందించిన గీతారెడ్డిని సద్భావన అవార్డుకు ఎంపిక చేయడం అభినందనీయం. రాజకీయాల్లో పదవుల కోసం పాకులాడే వారిని చూశాం. కానీ 2023 ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పిన గొప్ప వ్యక్తి గీతారెడ్డి. గాంధీ కుటుంబం తీసుకున్న నిర్ణయాలతోనే కాంగ్రెస్ హయాంలో దేశంలో పేదలకు మేలు జరిగింది. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రధాని పదవులను త్యాగం చేసిన ఘనత సోనియా, రాహుల్‌ది.

**హైడ్రా ఆగదు.. అక్రమార్కులకు కంటి మీద కునుకు ఉండదు :** రియల్ ఎస్టేట్ సంస్థలు భయపడొద్దు... వారికి నేను హామీ ఇస్తున్నా. మా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది.

హైడ్రా ఆగదు.. అక్రమార్కులకు కంటి మీద కునుకు ఉండదు. హైడ్రా అనగానే హరీశ్‌రావు, కేటీఆర్ బయటకు వస్తున్నారు. పేదలకు మేలు జరిగితే చూసి ఓర్వలేకపోతున్నారు. మూసీలో మగ్గిపోతున్న వారికి ఇళ్లు ఇచ్చి, వ్యాపారాలు చేసుకునేందుకు మహిళలకు ఆర్థిక సాయం అందించాం. మేం వారిని గుండెల్లో పెట్టుకుంటుంటే భారాస నేతలు గుండెలు బాదుకుంటున్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ ఫామ్ హౌస్‌ల విషయంపై అఖిలపక్షాన్ని పిలుద్దాం. నిజ నిర్ధారణ కమిటీతో నిజాలు నిగ్గు తేల్చుదాం. ఆ తరువాత మూసీ దగ్గరకా.. ఇంకెక్కడికైనా వెళదాం." అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉద్రిక్తత..

### పోలీసుల లాఠీ ఛార్జ్, ఇంటర్నెట్ సేవలు బంద్




హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయాన్ని ధ్వంసం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన నిరసనలు ఉద్రిక్తతకు దారి తీశాయి. హిందూ సంఘాల కార్యకర్తలు పదుల సంఖ్యలో ఆలయ పరిసరాల్లోకి చేరుకుని నిరసనలు తెలిపారు. ఆలయం వెనుక ఉన్న మసీదు వైపు హిందూ సంఘాలు కదులుతుండగా.. మత ఘర్షణలు చెలరేగే ప్రమాదం ఉందనే భయాల నడుమ పోలీసులు లాఠీలు ఝుళిపించారు. లాఠీ ఛార్జ్ తో ఆందోళన మరింతగా పెరిగింది. పదుల సంఖ్యలో హిందూ కార్యకర్తలు గాయపడ్డారు. పోలీసుల తీరును నిరసిస్తూ హిందూ ధార్మిక సంఘాల నేతలు భారీగా ఆలయ పరిసరాలకు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో పోలీసులకు ఆందోళనకారులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. హిందూ సంఘాల కార్యకర్తలు, పోలీసుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ర్యాలీని అడ్డుకున్న పోలీసులపైకి కార్యకర్తలు చెప్పులు, కుర్చీలు, వాటర్ ప్యాకెట్లు విసిరారు. పోలీసులు దొరికిన వారిని దొరికినట్లు చితకబాదారు. తమను అడ్డుకుంటున్న పోలీసులపైకి కొందరు చెప్పులు విసురుతున్నారు. లాఠీ ఛార్జ్‌లో పలువురి తలలకు తీవ్రంగా గాయాలయ్యాయి. లాఠీ ఛార్జ్‌లో ఎడమ చెయ్యి విరిగి దుర్గ అనే యువకుడు కుప్పకూలాడు. విషయం తెలుసుకున్న డీసీపీ రష్మీ పెరుమాల్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న హిందూ కార్యకర్తలకు నచ్చజెబుతున్నారు. పోలీసుల వైఖరికి వ్యతిరేకంగా నేతలు, కార్యకర్తలు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తున్నారు. మరోవైపు మతఘర్షణలు చెలరేగకుండా సికింద్రాబాద్ పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు సమాచారం.

## ఈనెల చివరినాటికి ప్రతి నియోజకవర్గానికి 4 వేల ఇందిరమ్మ ఇళ్లు

### 4 ఏళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యం - కాళ్లలో కట్టెలు పెట్టినా అభివృద్ధి సంక్షేమం ఆగదు

### రెవెన్యూ ,హౌసింగ్ ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు శ్రీపొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ అక్టోబర్ 19: ఈనెల చివరి నాటికి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి తొలివిడతగా 3500 నుంచి 4 వేల ఇళ్లను మంజూరు చేయబోతున్నామని రెవెన్యూ ,హౌసింగ్ ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు శ్రీపొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. వచ్చే నాలుగు సంవత్సరాలలో రాష్ట్రంలో అర్హులైన పేదవారందరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ఈ ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్నారు. వచ్చేనాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇళ్లకు తగ్గకుండా నిర్మిస్తామని తెలిపారు. కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు, ఎలాంటి తేడా లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే ఈ ప్రభుత్వ ఆశయమన్నారు. ఎలాంటి భేషజాలకు పోకుండా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన వాటా, నిధులు అడిగి తీసుకుంటామని , పెద్ద ఎత్తున రాష్ట్రానికి ఇండ్లను మంజూరు చేయాలని నిన్న హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర హౌసింగ్ జాయింట్ సెక్రటరీని కోరడం జరిగింది. గత ప్రభుత్వం పేదవాడి గురించి కనీస ఆలోచన చేయలేదని, పైన పటారం, లోపల లోటారం అన్నట్లుగా వ్యవహరించిందని విమర్శించారు. ఘోషా మహల్ నియోజకవర్గానికి చెందిన 144 మంది లబ్ధిదారులకు శనివారం నాడు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్‌తో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ,హౌసింగ్ ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు శ్రీపొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందుల ఎదురైనా ప్రతిపక్షాలు కాళ్లల్లో కట్టెలు పెడుతూ అభివృద్ధి సంక్షేమాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించినా ఏదీ ఆగదని పేదవాడి కన్నీరు తుడవడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ కాకి గోల వల్ల మా ప్రభుత్వానికి వచ్చే నష్టమేమీ లేదని , ఏడాది కూడా పూర్తికాకముందే మా ప్రభుత్వంపై రోడ్డు ఎక్కడం వల్ల బిఆర్ఎస్ కే నష్టమని అన్నారు. రెండున్నర సంవత్సరాల తర్వాత రోడ్డెక్కినా ఒక అర్థముంటుందన్నారు. పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేనిది, తమ ప్రభుత్వం చేసి చూపిస్తుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని విమర్శించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఒక మంచి జీవితాన్ని ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం వారికి ఇండ్లు, ఉద్యోగం, ఉపాధి, కల్పిస్తే బి ఆర్ ఎస్ ఓర్చుకోలేక పోతోందని, ప్రభుత్వం ఏదో తప్పు చేస్తున్నట్లుగా గోబెల్ ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ కాదు, మూసీ పరివాహక ప్రాంతాల ప్రజల జీవనోపాధి కోసం వారి జీవితాలను మెరుగుపరచడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు తమ జీవిత కాలం అదే మురికికుప్పలో బ్రతకాలని బి ఆర్ ఎస్ కోరుకుంటుందా అని మంత్రి గారు ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ కార్యక్రమం చేసిన ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతుంది.. మూసి పునర్జీవనంపై పై అనేక అభాండాలు వేస్తున్నారు.. అక్కడున్న పేదవారిని అక్కడే వదిలేస్తారా.. మూసి రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేసింది మీరు కాదా. ఇప్పుడు వారికి డబుల్ బెడ్రూం లు కేటాయించి మెప్మా ద్వారా వారికి ఉపాధి అవకాశాలు,పిల్లలకు చదువులు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుంటే ఓర్వలేకపోతున్నారు.. తెలంగాణ ఏర్పడినప్పుడు గళ్ళల పైసలతో ఇచ్చాం.. కానీ గత ప్రభుత్వం 7 లక్షల కోట్ల అప్పు చేసి 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ బకాయిలు చేశారు.. రాష్ట్ర ప్రజలను ఆందోళనకు గురి చేసే విధంగా ప్రభుత్వం ఇబ్బందులు పరిష్కరిస్తూ ముందుకు వెళ్తుంటే రాజకీయం చేస్తున్నారు.. మీరు బాధ్యత గల ప్రతిపక్షం అయితే నిర్మాణాత్మక సలహాలు ఇవ్వండి.. కాంగ్రెస్ పార్టీకి పరిపాలన ఎలా చేయాలో ప్రతిపక్షాలకు ఎలా గౌరవం ఇవ్వాలో తెలుసు.. అని అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజా సింగ్,శ్రీ గణేష్ ఎమ్మెల్సీలు బలమూరి వెంకట్, రహమత్ బేగ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు

# రేవంత్ రెడ్డి ప్లాన్

## ప్రజలకు నష్టం కలిగిస్తే ఊరుకునేది లేదన్న కేటీఆర్



హైదరాబాద్: మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు రేవంత్ రెడ్డి ప్లాన్ వేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రూ.26 వేల కోట్లతో మొత్తం మూసీ పునరుజ్జీవం అవుతుందని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్‌కు మూటలు మోయడానికి రేవంత్ రెడ్డి దొరికాడని చెప్పారు. హైడ్రా పేరుతో బిల్డర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. మూసీ బఫర్ జోన్‌లో ఉన్నవాళ్లను కబ్జాదారులని రేవంత్ ముద్ర వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నాగోల్‌లోని ఎస్టీపీని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కేటీఆర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నాగోల్‌లో దేశంలోనే అతిపెద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించామని చెప్పారు. ఇక్కడ శుద్ధి చేసిన నీళ్లు నల్లగొండ జిల్లాకు పోతాయన్నారు. రేవంత్ రెడ్డి కొత్తగా చేసేదేం లేదన్నారు. ఈ ఎస్టీపీలను సక్రమంగా నడుపుకుంటే చాలన్నారు. మూసీ నది హైదరాబాద్ ఒక వరమని, దానిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలేనని చెప్పారు. హైదరాబాద్‌లో రోజూ 20 కోట్ల లీటర్ల మురికినీరు ఉత్పత్తి అవుతున్నదని తెలిపారు. దక్షిణాసియాలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే నగరం లేదని వెల్లడించారు. మురుగునీటిని వంద శాతం శుద్ధి చేస్తున్నది ఒక్క హైదరాబాద్‌లోనేనని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే ఈ ఘనతను సాధించామన్నారు. రూ.3,800 కోట్ల ఖర్చుతో ఎస్టీపీల నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. నగరంలోని 54 నాలాల నుంచి మూసీలోకి మురికి నీరు వస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఎస్టీపీలను రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో 57.7 కిలోమీటర్లు మూసీ ప్రవహిస్తుందన్నారు. మూసీపై 15 చోట్ల బ్రిడ్జిలను నిర్మించాలని ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. చారిత్రక, వారసత్వ సంపదను కాపాడుతూ ఆధునికంగా నిర్మించాలని నిర్ణయించామన్నారు. బ్రిడ్జిల నిర్మాణానికి రూ.545 కోట్లు మంజూరు చేశామన్నారు. రోడ్ కం బ్రిడ్జ్ కం చెక్ డ్యాం నిర్మించాలనుకున్నామని చెప్పారు. మూసీపై రూ.10 వేల కోట్లతో భారీ స్కై ఓవర్ నిర్మించాలనుకున్నామని తెలిపారు. ఎంత శుద్ధి చేసినా మూసీ నీళ్లు తాగేవి కాదని చెప్పారు. అందువల్ల కొండపోచమ్మ సాగర్ నుంచి మూసీకి నీళ్లు తేవాలని నిర్ణయించామన్నారు. గోదవారి నుంచి నీళ్లు తెచ్చేందుకు రూ.1100 కోట్లతో ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఆ ప్రాజెక్టుకు గతేడాది మే 18న శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు రేవంత్ రెడ్డి ప్లాన్ వేశారని చెప్పారు. రూ.26 వేల కోట్లతో మొత్తం మూసీ పునరుజ్జీవం అవుతుందని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్నారని విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్‌కు మూటలు మోయడానికి రేవంత్ రెడ్డి దొరికాడని చెప్పారు. హైడ్రా పేరుతో బిల్డర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మూసీ బఫర్ జోన్‌లో ఉన్నవాళ్లను కబ్జాదారులని రేవంత్ ముద్ర వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తనను మూసీ వద్ద 3 నెలలు ఉండాలని అంటున్నడు.. 60-70 ఏండ్ల నుంచి ప్రజలు ఇక్కడే ఉంటున్నారని తెలుసుకోవాలన్నారు. మూసీ పక్కన తాను మూడు నెలలు కాదు మూడేండ్లు ఉంటానని స్పష్టం చేశారు. మూసీ తనకు చిన్నప్పటి నుంచి తెలుసని, కొత్తగా రేవంత్ చెప్పాల్సింది లేదన్నారు. సోకుల కోసం పేదలను రోడ్డున పడేయొద్దని ముఖ్యమంత్రికి సూచించారు. రేవంత్ తన కుర్చీ కాపాడుకోవడానికి కావాలంటే చందాలిస్తామన్నారు. 2400 కిలోమీటర్ల పొడవైన నమామి గంగే ప్రాజెక్టు కోసం ప్రధాని మోదీ రూ.40 వేల కోట్లు ఖర్చు చేశారని, మూసీ కోసం రేవంత్ కిలోమీటర్‌కు రూ.2700 కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. మూసీకి రెండువైపుల రిటెయినింగ్ వాల్ కట్టాలని సూచించారు. మూసీ మీద ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని చెప్పారు. అంతకంటే కొత్తగా రేవంత్ రెడ్డి చేయాల్సిందేమీ లేదన్నారు. మూసీ బాధితులకు తామంతా అండగా నిలబడతామని చెప్పారు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్ లేకుండానే ఇండ్లెందుకు కూలగొడుతున్నారని ప్రశ్నించారు. ఇండ్లు ఖాళీ చేయాలని అధికారులు అడిగితే నిలదీయాలని ప్రజలకు సూచించారు. మూసీ పేరుతో జరుగుతున్న లూటీకి చరమగీతం పాడాలన్నారు. నాలా అభివృద్ధి పనుల వల్ల గతంలో మునిగిన కాలనీలు ఇప్పుడు సురక్షితంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి గ్రాఫిక్స్ మాయాజాలానికి మీడిగా ఆగం కావొద్దన్నారు. మూసీలోని మురికి నీరు ఎస్టీపీలో ఎలా శుభ్రం అవుతుందో కేటీఆర్ చూపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీవరేజ్ ప్లాంట్ల ఏర్పాటును కేటీఆర్ చేపట్టారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. రూ.3800 కోట్లతో 31 ఎస్టీపీల నిర్మాణాన్ని చేపట్టామని వెల్లడించారు. స్వచ్ఛమైన నీరు మూసీలోకి వదలాలని ఈ ఎస్టీపీలను నిర్మిస్తున్నామని తెలిపారు. మూసీపై 15 బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని భావించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మూసీ ప్రాజెక్టుపై డీపీఆర్ లేదని, ఎస్టిమేషన్ లేదని విమర్శించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే చర్యలకు పాల్పడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మూసీ పరివాహక ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

గరుడ వార్త



# సంపాదకీయం

## యూఎస్ రాజకీయాల్లో చెప్పుకోదగ్గ శక్తిగా ఇండియన్స్...

## ఎంతలా అంటే..?

జరిగేది అమెరికా అధ్యక్ష ఎన్నికలు అయినప్పటికీ... ఇది అగ్రరాజ్యం కావడంతో ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాల్లోని ఇది చర్చనీయాంశంగా ఉంది! ఇక భారత్ లో సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అమెరికాతో భారత్ కున్న బంధం అలాంటిది మరి! ఈ సమయంలో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా భారతీయులు పోషిస్తున్న కీలక పాత్ర ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అవును... సుమారు 161 మిలియన్లకు పైగా ఉన్న బలమైన యూఎస్ ఓటర్లలో ఓ చిన్నభాగం మాత్రమే అయిన 2.1 మిలియన్ల భారతీయ అమెరికన్ ఓటర్లు.. ఆ దేశ రాజకీయాల్లో చెప్పుకోదగ్గ శక్తిగా ఎదుగారు.. ఎదుగుతూనే ఉన్నారు! ఈ సమయంలో భారత మూలాలున్న కమలా హారిస్ తో ప్రెసిడెన్షియల్ బ్యాలెట్ లో వీరి సంఘం కీలక భూమిక పోషిస్తోందని అంటున్నారు. అమెరికాలో విద్యావంతులు, సంపన్న సమూహంగా తమను తాము స్థాపించుకున్న భారతీయ అమెరికన్లు... కేవలం ఓటర్లుగా మాత్రమే కాకుండా.. అభ్యర్థులుగా, క్రౌడ్ పుల్లర్లుగా, నిధుల సమీకరణ దారులుగా కూడా బలంగా మారుతున్నారని అంటున్నారు. ఈ విషయాలపై తాజాగా స్పందిస్తూ కీలక విషయాలు వెల్లడించారు డెమోక్రాటిక్ నేషనల్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు అజయ్ భుటోరియా. ఇందులో భాగంగా.. ఎప్పటిలాగానే ఎక్కువ మంది ప్రజలు ముందుకు వస్తున్నారని. అయితే ఈ సమయంలో పెద్ద మొత్తంలో విరాళాలు ఇస్తూ, రాజకీయ ప్రక్రియలో మరింత చురుగ్గా పాల్గొంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా... భారతీయ అమెరికన్ కుటుంబాల మధ్యస్థ ఆదాయం 1,45,000 డాలర్లుగా ఉందని.. యూఎస్ మధ్యస్థ ఆదాయం కంటే ఇది 21% ఎక్కువని అంటున్నారు. ఇదే సమయంలో... ఆసియా అమెరికన్ డయాస్పోరార్లో అతిపెద్ద సూపర్ పొలిటికల్ యాక్షన్ కమిటీ అయిన ఏఏపీఐ విక్టరీ ఫండ్ వ్యవస్థాపకుడు శేఖర్ నరసింహన్ స్పందిస్తూ... భారతీయ అమెరికన్లు ఎన్నికల ప్రచారానికి ఎంత ఆర్థ సాయం చేస్తున్నారో కచ్చితమైన డేటాను కనుగొనడం అంత సులభం కాదని అన్నారు. అయినప్పటికీ... సమాజంలో పెద్ద సంఖ్యలో ఈ కేటగిరీ దాతలు ఉన్నారని స్పష్టం చేశారు. ఇదే సమయంలో... వివేక్ రామస్వామితో భారతీయ అమెరికన్ మద్దతుదారులు రిపబ్లికన్ పార్టీకి విధేయులుగా ఉన్నారు. ఎప్పటినుంచో రిపబ్లికన్ విశ్వాసిగా ఉంటూ.. ఈ ఏడాది రిపబ్లికన్ నేషనల్ కన్వెషన్ లో ఏకైన భారతీయ అమెరికన్ ప్రతినిధిగా ఉన్న సంపత్ శివంగి.. ట్రంప్ ప్రచారానికి పెద్ద ఎత్తున నిధులు పంపుతున్నారని.. హొటల్ వ్యాపారి డానీ గైక్వాడ్ కూడా ఈ జాబితాలో ఉన్నారని అంటున్నారు. ఇలా రెండు పార్టీలకూ బలమైన భారతీయ అమెరికన్లు ఏఏపీఐ డేటా 2024 ప్రకారం 55 శాతం మంది భారతీయ అమెరికన్లు డెమోక్రాట్లకు.. 25 శాతం మంది రిపబ్లికన్లకు మద్దతు ఇస్తుండగా.. 15 శాతం మంది న్యూట్రల్ గా ఉన్నట్లు గుర్తించారని అంటున్నారు. కాగా... వైట్ హౌస్ కి వెళ్లే రహదారి సిలికాన్ వ్యాలీ గుండా వెళ్తుందనేది నానుడి.

ఇది టెక్నాలజీ రంగంలో సంపన్న భారతీయుల కేంద్రంగా ఉంది. ఈ నేపథ్యలో... కమలా హారిసి ఇటీవల కాలిఫోర్నియా నిధుల సమీకరణలు ఒక వారంలో సుమారు 55 మిలియన్లు సంపాదించాయని చెబుతున్నారు. ఆమె నామినీ అయినప్పటి నుంచీ బిలియన్ డాలర్లు సేకరించినట్లు చెబుతున్నారు.

# క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు : ఇన్స్పెక్టర్ శ్రీనాథ్



శామీర్ పేట, (గరుడ వార్త) : క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే ఉన్నత శిఖరాలలో అధిరోహించగలుగుతారని శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. మండల కేంద్రం శామీర్ పేట మినీ స్టేడియంలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఖో ఖో క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ క్రీడలతో మానసికోలాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందని తెలిపారు. క్రీడల్లో రాణించి పాఠశాలలకు, గ్రామాలకు మంచు గుర్తింపు తీసుకురావాలని చెప్పారు. గెలుపొందిన విజేతలు...అండర్ 17 బాలికల విభాగంలో కుత్బుల్లాపూర్ ప్రథమ స్థానంలో నిలువగా, ఘట్కేసర్ జోన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే అండర్ 17 బాలురుల విభాగంలో ప్రథమ స్థానంలో శామీర్ పేట జోన్ నిలువగా ద్వితీయ స్థానాన్ని మేడ్చల్ జోన్ దక్కించుకుంది. అండర్ 14 బాలికల విభాగంలో ప్రథమ స్థానం కుత్బుల్లాపూర్ జోన్ కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానం శామీర్ పేట జోన్ దక్కించుకుంది. అలాగే అండర్ 14 బాలురుల విభాగంలో ప్రథమ స్థానంలో శామీర్ పేట జాన్ కైవసం చేసుకోగా ఘట్కేసర్ జోన్ ద్వితీయ స్థానంలో నిలిచింది. కాగా ఈ క్రీడా పోటీలలో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కిష్టయ్య, శామీర్ పేట మండల విద్యాధికారిణి వసంత కుమారి, శామీర్ పేట సబ్ ఇన్స్పెక్టర్ హారిక, శామీర్ పేట జోన్ సెక్రెటరీ సత్తిరెడ్డి, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిధులు చాలక.. నిర్మాణాలు సాగక



గంభీరావుపేట: ఆట పాటలతో సాగే అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేక చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. నిధులు చాలక ఏళ్ల తరబడి నిర్మాణం మధ్యలో ఆగిపోయాయి. దీంతో అద్దె భవనాలు, పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లబ్ధిదారులు అవస్థలు పడుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు.
జిల్లాలో సిరిసిల్ల, వేములవాడలో రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 587 ఉన్నాయి. ఇందులో 51 అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. రెండింటికి మిగులు పనులకు నిధులు మంజూరు కాగా పనులు చేస్తున్నారు. ఇంకా 49 భవనాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. కొన్ని భవనాలు స్లాబ్ దశలో, మరికొన్ని ప్లాస్టరింగ్, బెడ్, విద్యుత్తు పనులు చేయాల్సి ఉంది. కొన్ని కేంద్రాలకు ఒకసారి నిధులు మంజూరు కాగా, కొన్నింటికి రెండు సార్లు విడుదల చేసినా చాలక మధ్యలో ఆగిపోయాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిధులు మంజూరు చేసి భవనాల పూర్తికి చర్యలు చేపట్టాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇవీ ఇబ్బందులు

అద్దె భవనాలు, పాఠశాల భవనాల్లో నిర్వహిస్తుండటంతో పూర్తి స్థాయిలో వసతులు లేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు.
సరైన వెలుతురు లేకపోవటం, గదులు చిన్నవిగా ఉండటంతో చిన్నారులు ఆడుకోవడానికి వీల్లేకుండా ఉంది. కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులకు అనుకూలంగా భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.
అద్దె భవనాల్లో మూత్రశాలలు లేకపోవడంతో తిప్పలు తప్పడం లేదు.
ఈ చిత్రంలో కనిపిస్తున్న గంభీరావుపేట మండలంలోని నర్మాల క్యాంపులోని అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి 2015 సంవత్సరంలో రూ.4 లక్షలు మంజూరయ్యాయి. 2018లో మరో రూ.3 లక్షలు విడుదల చేశారు. వీటితో 80 శాతం పనులు పూర్తయ్యాయి. తలుపులు, కిటికీలు, విద్యుత్తు తదితర పనులు మిగిలిపోయాయి. ప్రస్తుతం ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రం రెండు పడక గదుల ఇంట్లో నిర్వహిస్తున్నారు.

త్వరగా పూర్తి చేయాలి

మండలంలోని ముస్తఫనగర్‌లో పక్కా భవనం నిర్మాణంలో ఆగిపోయింది. కేవలం స్లాబ్ వరకు మాత్రమే పనులు చేశారు. దాదాపు పది సంవత్సరాలు అవుతుంది. అద్దె భవనంలో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే పూర్తి చేసి సమస్యలను తీర్చాలి.
బండ కస్తూరి, అంగన్‌వాడీ చిన్నారి తల్లి, ముస్తఫనగర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలో 51 భవనాలు నిర్మాణం మధ్యలో ఆగిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కేవలం రెండు భవనాలకు నిధులు మంజూరు చేశారు. వాటి పనులు కొనసాగుతున్నాయి. దశల వారీగా నిధులు మంజూరు చేసి, అసంపూర్తిగా ఉన్న వాటిని కూడా పూర్తి చేస్తాం. లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ అధికారి

# మిద్దెపై పంట.. ఇంట్లో వంట

సూర్యాపేట : సూర్యాపేట పురపాలికలో మిద్దె సాగుపై ప్రజలు దృష్టి సారిస్తున్నారు. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తమ ఇళ్లపై వివిధ కూరగాయలు సాగు చేస్తున్నారు. రెండేళ్లలో సూర్యాపేట పట్టణంలో 1,130 మందికి పైగా తమ ఇళ్లపై కూరగాయలు పండిస్తున్నారు. పెరుగుతున్న ధరలు, ఆరోగ్య సమస్యల కారణంగా ప్రజలు సొంతంగా కూరగాయలు పండించి తింటున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సూర్యాపేట పురపాలికలో అధికంగా ఉండగా.. మిగతా పురపాలికల్లో అడపాదడపా సాగు చేస్తున్నారు. దీనిపై పుర అధికారులు కూడా అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటుగా రూ.1500 చెల్లిస్తే రాయితీపై రూ.10 వేల విలువైన పరికరాలు అందజేస్తున్నారు. కూరగాయలు సాగు చేపట్టేందుకు బ్యాగులు, ఎరువులు అందించి ముందుకు సాగుతున్నారు. దీంతో పట్టణంలోని మహిళలతో పాటు పురుషులు మిద్దెసాగుకు ముందుకొస్తున్నారు.



విధులకు వెళ్తూ..సూర్యాపేట పట్టణంలోని తిరుమలనగర్‌కు చెందిన రాము ప్రభుత్వ ఉపాధ్యాయుడు. విధులు నిర్వర్తిస్తూనే మిద్దెపంటపై మక్కువతో సాగు చేపట్టారు. ఆరేళ్ల నుంచి ఇంటిపై వివిధ రకాల కూరగాయలను రసాయన మందులు వినియోగించకుండా పండిస్తున్నారు. పాఠశాలకు వెళ్లి వచ్చిన తర్వాత నీటిని అందించటంతోపాటు వాటికి కావాల్సిన ఎరువులు అందిస్తారు. మిద్దె తోట వల్ల పురుగు మందులేని కూరగాయలు తినొచ్చని రాము చెబుతున్నారు. ఉన్న కొద్దిపాటి ఇళ్లపై టెర్రస్లో, ఆర్గానిక్ కూరగాయలు పండించుకోవచ్చని సూచించారు.
కూరగాయల రకాలుమిద్దెపై బెండ, కాకర, బీర, సొర, గుమ్మడి, దొండ, వంకాయ, చిక్కుడు, గోకర, కాయగూరలు, పాలకూర, తోటకూర, పొన్నగంటి కూర, గోంగూర, బచ్చలికూర, పుదీనా, కొత్తిమీర, టమాట, పచ్చిమిర్చి, ఉసిరి, మామిడి, జామ, నిమ్మ, యాపిల్‌బేర్, దానిమ్మ వంటి రకాలు నాటారు.

# ప్రణాళిక మారింది..!

నల్గొండ : పంచాయతీ సర్పంచుల పాలకవర్గం గడువు ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగిసింది. ఈ మేరకు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా తయారీలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ నెల 6న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించాల్సి ఉండగా.. తాజాగా షెడ్యూల్ మారుస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇప్పటికే మొదలైన సంప్రదింపులు..

పంచాయతీ ఎన్నికల అంశం తెరపైకి రావడంతో ఇప్పటికే స్థానిక నేతల్లో జోష్ వచ్చింది. ప్రభుత్వం రిజర్వేషన్లకు సంబంధించి ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. పాత రిజర్వేషన్లను అలాగే కొనసాగిస్తారా? లేదా? అనేది తెలియక అయోమయానికి గురవుతున్నారు. తమకు అనుకూలమైన రిజర్వేషన్ వస్తే పోటీ చేసేందుకు ఇప్పటినుంచే జిల్లాస్థాయి నాయకులతో సంప్రదింపులు చేస్తున్నారు.
సిబ్బంది ఎంపిక..గతంలో మాదిరి ఈసారి కూడా పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఎన్నికలు జరుపనున్నారు. ఇందుకు అవసరమైన బ్యాలెట్ పెట్టెలు ఇప్పటికే సమకూర్చారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు సిబ్బందిని తీసుకుంటున్నారు. ప్రభుత్వ శాఖల నుంచి ఎన్నికల విధులకు అధికారులను, సిబ్బందిని ఎంపిక చేసేందుకు ఆయా శాఖల నుంచి



ఉద్యోగుల, అధికారుల వివరాలు సేకరించే ప్రక్రియ ప్రారంభించారు. వీరిలో వారి హొదాను అనుసరించి ఎన్నికల విధులు అప్పగించనున్నారు. వీరికి త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నారు.

28న తుది జాబితా..మారిన షెడ్యూల్


ప్రకారం ఈ నెల 13వ తేదీన ఓటర్ల ముసాయిదా ప్రకటిస్తారు. 14వ తేదీ నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 18న జిల్లా స్థాయిలో, 19న మండల స్థాయిలో ఎంపీడీవోలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సందేహాలు, అభ్యంతరాలపై చర్చిస్తారు.
26న జిల్లా పంచాయతీ అధికారులు అభ్యంతరాలపై తుది నిర్ణయం తీసుకుంటారు. 28న వార్డుల వారీగా ఓటరు తుది జాబితాను ప్రకటిస్తారు. ఒక వార్డులో 650 మంది ఓటర్లు ఉండే విధంగా తయారు చేస్తున్నారు. అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉంటే అదనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒక పోలింగ్ కేంద్రంలో ఉండేలా జాబితా రూపొందిస్తున్నారు.

జిల్లాలో ఎన్నికలు జరిగే పంచాయతీలు

నల్గొండ 868 సూర్యాపేట 486యాదాద్రి 428

# కాలువలు లేకుండానే పొలాలకు నీరు

తాంసి : ఆదిలాబాద్ జిల్లాలోని మత్తడివాగు ప్రాజెక్టు కుడి కాలువ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం 2015లో రూ.5.75 కోట్లు మంజూరు చేసింది. తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో(పైపులైన్) కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఎనిమిదేళ్ల కిందట ప్రారంభమైన పనులు ఆగుతూ.. సాగుతూ ఎట్టకేలకు పూర్తయ్యాయి.
కొత్త ప్రయోగం..సాగు నీటి కోసం సాధారణంగా భూసేకరణ చేసి కాలువలు నిర్మిస్తారు. దీని వల్ల ఇటు రైతుల భూములు తీసుకోవడంతో పాటు అటు పరిహారం సమస్య ఏర్పడుతోంది. వీటిని అధిగమించేందుకు అధికారులు కొత్త రకం పద్ధతిని ఎంచుకున్నారు. తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్టు కుడి కాలువ నుంచి దాదాపు 1,243 ఎకరాలకు సాగు నీరందించేందుకు పంట చేలలో తవ్వి భూగర్భంలో పైపులైన్లు వేయించారు. వీటి వల్ల పంటల సాగుకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. 9 కిలో మీటర్ల పొడవునా 450 డయా వ్యాసం ఉండే పైపులైన్ వేయగా, మధ్యలో చిన్న పైపులైన్ల(డిస్ట్రిబ్యూటరీ లైన్)ను అనుసంధానించారు. ఎత్తిపోతల పథకం మాదిరిగా మత్తడివాగు ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకునేందుకు సంప్‌హౌజ్ నిర్మాణం చేపట్టి, అందులో 75 హెచ్‌పీ సామర్థ్యంతో నాలుగు వేర్వేరు మోటార్లను ఏర్పాటు చేశారు. రైతుల భూములకు సాగు నీరందించడానికి 200 చోట్ల అవుట్‌లెట్లు ఏర్పాటు చేశారు. ప్రతి అవుట్‌లెట్ నుంచి ఆరు ఎకరాలకు సాగు నీరందించవచ్చు. ఈ అవుట్‌లెట్ పైపులైన్‌కు ఆనుకొని ఉన్న బాక్సుల్లో ఆటోమెటిక్ వాల్వు ఏర్పాటు చేయించారు. ఇందులో ఉండే సెన్సర్ నీరు రాగానే వాల్వు



తెరుచుకునేలా చేస్తుంది. నీటి సరఫరా ఆగిపోగానే మూసివేస్తుంది. సౌర విద్యుత్తు ఆధారంగా ఇది పని చేసేలా ఏర్పాటు చేశారు. ఎనిమిదేళ్ల కిందట ప్రారంభమైన పనులు ఎట్టకేలకు పూర్తి కావడంతో ఈ ఏడాది ఖరీఫ్ నుంచి సాగు నీటిని విడుదల చేయనున్నట్లు నీటి పారుదల శాఖ డీఈ శ్రీనివాస్ తెలిపారు. ఎన్నో ఏళ్ల కల.. ఎట్టకేలకు నెరవేరుతుండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక రెండు నుంచి మూడు పంటలు పండిస్తామంటున్నారు.

లబ్ధి పొందే గ్రామాలు : తాంసి మండలంలోని హస్నాపూర్, పొన్నారి, వడ్డాడి, తలమడుగు మండలంలోని ఖోడద్, ఆదిలాబాద్ మండలంలోని తరోడ గ్రామం

ప్రత్యేకత : మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో పైపులైన్ ద్వారా కాలువ నిర్మాణం

ఆయకట్టు : 1,243 ఎకరాలు

వ్యయం : 5.75 కోట్లు

కాలువ పొడవు : 9 కిలో మీటర్లు

అవుట్‌లైట్లు : 200

ఒక అవుట్‌లెట్ ద్వారా సాగునీరు : 6 ఎకరాలకు

# మైదానం తోడుగా.. ఉద్యోగ సాధన

నడిగూడెం : వ్యాయామ విద్యను అభ్యసించిన 50 మందికి పైగా నడిగూడెం యువకులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వ్యాయామ శిక్షకులుగా రాణిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం నడిగూడెంలో దాత కొల్లు పాపయ్య చౌదరి విరాళంతో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విశాలమైన క్రీడా మైదానం అందుబాటులో ఉండటమే. నిత్యం వందల సంఖ్యలో యువతీ, యువకులు ఇక్కడ సాధన చేస్తుంటారు. దీనివల్లే ఎక్కువ మంది పోలీస్ కానిస్టేబుల్, వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికవుతున్నారు. ఇటీవల నిర్వహించిన పలు వ్యాయామ ఉద్యోగ నియామకాల్లో నలుగురు ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన పలువురు వ్యాయామ ఉపాధ్యాయులుగా పలు చోట్ల విధులు నిర్వహిస్తున్నారు.

క్రీడలపై మక్కువతోనే...

– పి.ప్రకాశ్, జడ్పీహెచ్ఎస్, బేతవోలు

గ్రామంలో విశాలమైన క్రీడా మైదానం అందుబాటులో ఉండటం, నిత్యం సాధన చేయడంతో పాటు, క్రీడలపై ఉన్న ఆసక్తితో ఉద్యోగం సాధించాను. ఇక్కడ పది, ఇంటర్ పూర్తి చేసిన అనంతరం వ్యాయామ శిక్షణ కోర్సు పూర్తి చేసి ఉద్యోగం సాధించాను. తోటి యువతకు నిత్యం శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నాను.

యువతకు శిక్షణనిస్తున్నా...

– పి.నాగేశ్వరరావు, జడ్పీహెచ్ఎస్, తుమ్మగూడెం

వ్యాయామ శిక్షణ కోర్సు పూర్తి చేసి తొలి ప్రయత్నంలోనే ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాను. అందుబా



టులో ఉన్న మైదానంలో యువతకు పోలీసు ఉద్యోగాలు, ఇతర ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాను. వేసవి సెలవులు, దసరా సెలవుల్లో నిర్వహించే ప్రత్యేక క్రీడా పోటీలకు నా వంతు సహకారం అందిస్తున్నా.

నిత్య కృషితోనే....

కె.సృజన్, మైనార్టీ గురుకుల పాఠశాల, సూర్యాపేట

వ్యాయామ విద్య శిక్షణ పూర్తి చేశాను. పలు ప్రైవేటు, పాఠశాల, కళాశాలల్లో పీఈటీగా విధులు నిర్వహించా. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో నిత్యం కృషి చేస్తూ కలను సాకారం చేసుకున్నాను. నిత్య సాధనతోనే ప్రభుత్వ ఉద్యోగం సాకారమైంది. మైనార్టీ గురుకుల పాఠశాలలో పీడీగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

ఎంతో ఆనందంగా ఉంది...


కె.శ్యామల, మైనార్టీ గురుకుల పాఠశాల, కోదాడ

మైనార్టీ గురుకుల పాఠశాలలో పీడీగా ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సొంతంగా సాధన చేసి తొలి ప్రయత్నంలోనే సాధించాను. నేటి యువత సాధన చేస్తే ఏలాంటి కొలువునైనా ఇట్టే సాధించవచ్చు.

# గోదాముల కోసం వెతుకులాట

భువనగిరి: కొనుగోలు చేసిన ధాన్యం గోదాముల్లో నిల్వ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లా యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తోంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం సీఎంఆర్ కోసం మిల్లర్లకు ఇవ్వొద్దని పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. కొనుగోలు చేసిన ధాన్యం ఎప్పటికప్పుడు మార్కెటింగ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, పౌరసరఫరాల సంస్థ, ప్రైవేట్ గోదాములకు తరలించాలన్న ఆదేశంతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పటికే జిల్లాలో స్థలాభావ సమస్య నెలకొనగా.. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అధికారులు తలపట్టుకున్నారు. గోదాముల కోసం వెతుకులాట పనిలో ఉన్నారు.

ఈ సీజన్‌లో యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 6.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. ఇందులో రైతులు సొంత అవసరాలు, మిల్లర్లు కొనుగోలు చేయగా సన్న, సాధారణ రకం కలిపి 4లక్షల మెట్రిక్ టన్నులను ప్రభుత్వ కొనుగోలు సంస్థలకు విక్రయిస్తారని అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 368 కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నారు. సన్న, దొడ్డు రకాల ధాన్యానికి విడివిడిగా గోదాముల్లో నిల్వ చేయనున్నారు. లభ్యత లక్ష ఎంటీలకే కొనుగోలు లక్ష్యం నాలుగు లక్షల ఎంటీలు కాగా ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ గోదాముల్లో కేవలం లక్ష వరకే స్థలం లభ్యత ఉన్నట్లు అధికారులు గుర్తించారు.



మిగిలిన 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కడ నిల్వచేయాలన్న విషయమై తర్జనభర్జన పడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా మార్కెటింగ్ శాఖకు చెందిన 18 గోదాములు ఉన్నాయి. వాటి నిల్వ సామర్థ్యం సుమారుగా 80 వేల ఎంటీలు ఉంటుందని అంచనా. ప్రస్తుతం మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారుల వద్ద 66,166 ఎంటీల అద్దెకు తీసుకున్నారు. వారిని ఖాళీ చేయించాలని మార్కెట్ కార్యదర్శులకు ఆదేశించినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సబిత 'న్యూస్‌టుడే'గా తెలిపారు.

సమగ్ర నివేదిక సమర్పిస్తున్నాం

– జగదీశ్వర్, డీఎం, పౌర సరఫరాల సంస్థ, యాదాద్రి భువనగిరి

జిల్లాప్రస్తుతానికి జిల్లాలో సమీకృత, మార్కెటింగ్ శాఖ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లో సుమారు లక్ష మెట్రిక్ టన్నులను నిల్వ చేసే సామర్థ్యం ఉంది. జిల్లాలో ఉన్న గోదాములు, నిల్వ సామర్థ్యం పూర్తి వివరాలతో తమ శాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తున్నాం. ఈ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

# వైద్య విద్య.. మరింత చేరువ



తాండూరు: జిల్లా వాసులకు వైద్య విద్య, తదనంతర సేవలు మరింత చేరువకానున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రం, తాండూరు పట్టణాల్లో జిల్లా ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. వీటికి తోడు జిల్లాకు మంజూరైన వైద్య కళాశాలల నిర్మాణం పూర్తయితే స్థానికులకు మరింత నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. బయటి పేషెంట్లు వచ్చి చికిత్సలు చేసుకునే అవకాశం లభిస్తుంది. వీరిలో కొందరికి కొన్ని సందర్భాల్లో చిన్నపాటి శస్త్రచికిత్సలను కూడా చేయాల్సి ఉంటుంది. ప్రొఫెసర్లు శస్త్రచికిత్సలు చేస్తూనే వైద్య విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు మెలకువలు వివరిస్తారు. రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు కూడా అత్యవసర వైద్య సేవలు అందుతాయి.తాండూరు, కొడంగల్‌లో నర్సింగ్ కళాశాలలు: జిల్లాలో వికారాబాద్, కొడంగల్‌కు వైద్య కళాశాలలు మంజూరైన విషయం విదితమే.. వికారాబాద్‌లో పనులు ప్రారంభమైతే కొడంగల్‌లోని అప్పాయిపల్లిలో భూసేకరణ పూర్తయింది. పనులు చేపట్టేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచే పనిలో నిమగ్నమైంది. ఇదే సమయంలో తాండూరు, కొడంగల్‌లో నర్సింగ్ కళాశాలలు మంజూరయ్యాయి. తాండూరులో ఇప్పటికే కళాశాలకు సంబంధించిన భవన నిర్మాణం జరుగుతోంది.

టెండర్లు పూర్తి కాగానే పనులు

శ్రీధర్‌రెడ్డి, జిల్లా రహదారులు, భవనాల శాఖ ఈఈ, వికారాబాద్

కొడంగల్‌లో కళాశాలల నిర్మాణాలకు భూసేకరణ పూర్తయింది. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు శరవేగంగా జరుగుతాయి. వికారాబాద్‌లో ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి.

ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పూర్తి

లక్ష్మీనారాయణ, వైద్య, ఆరోగ్య శాఖ డీఈ, వికారాబాద్

తాండూరులో చేపడుతున్న నర్సింగ్ కళాశాల నిర్మాణాన్ని ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పూర్తి చేస్తాం. పనులు పూర్తి కాగానే సంబంధిత అధికారులకు భవనాన్ని అప్పగిస్తాం.

కళాశాలల భవనాలకు నిధుల మంజూరు (రూ.కోట్లలో)

వికారాబాద్ వైద్య : 235

కొడంగల్ వైద్య : 124.5

కొడంగల్ నర్సింగ్ : 46 తాండూరు నర్సింగ్: 25 కొడంగల్ పారామెడికల్, ఫిజియోథెరపీ : 27

# ఇంధనం కొరత.. నీటి సరఫరా నిలిపివేత



కరీంనగర్ : మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రం వద్ద ఉన్న విద్యుత్తు నియంత్రికలో సాంకేతిక సమస్య ఏర్పడింది. మరమ్మతులు చేయడంలో ఆలస్యం జరగగా ఉదయం 7 గంటలకు విద్యుత్తు సరఫరా పునరుద్ధరించారు. నాలుగు గంటలపాటు కరెంటు లేకపోవడంతో పక్కనే ఉన్న జనరేటర్‌ను నడిపించాల్సి ఉండగా నడిపించలేదు. అయిదు గంటలు ఆలస్యంగా నీటి సరఫరా ప్రారంభించారు.

వరకు అదే నియంత్రికపై రెండుసార్లు సీటీబీటీ కాలిపోయింది. 12 గంటలపాటు విద్యుత్తు అంతరాయం కలగక నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ఎగువ ప్రాంతంలోని అత్యధిక డివిజన్లకు నీటి సరఫరా నిలిపివేశారు.

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్తు సరఫరాలో సాంకేతిక సమస్యలు నీటి సరఫరాపై ప్రభావం పడుతుండటంతో నగరవాసులు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దసరా, బతుకమ్మ పండగ తెల్లవారి నుంచే నీటికి కటకట ఏర్పడటం, తాగేందుకు నీళ్లు లేక డబ్బాలు పట్టుకొని రిజర్వాయర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. లోలెవల్ పరిధిలో పాత నీటిశుద్ధి కేంద్రం నుంచి నీటిని పంపిణీ చేస్తుండగా, హైలెవల్ జోన్‌కు మిషన్ భగీరథ శుద్ధి కేంద్రం నుంచి పంపింగ్ చేస్తున్నారు.

వినియోగించుకోని సౌకర్యాలు

నగరంలో విద్యుత్తు అంతరాయం తరచూ ఉంటుంది. పలు కారణాలతో గంటల కొద్ది నిలిపివేస్తుండగా ఆ సమయంలో నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా అధికారులు రెండు ఫిల్టర్‌బెడ్లు, రెండు ప్రధాన రిజర్వాయర్ల దగ్గర జనరేటర్ల సౌకర్యాలు కల్పించారు. జ్యోతినగర్ రిజర్వాయర్ దగ్గర నిరంతర విద్యుత్తు సౌకర్యం కూడా ఉంది. జనరేటర్లు నడవాలంటే డీజిల్ తప్పనిసరిగా నిల్వ ఉంచుకోవాలి. కనీసం మూడు గంటలు నడిచేలా నిల్వ ఉంచుకోవాల్సిన ఉండగా ఈ మధ్య బిల్లుల భారంతో పట్టనట్లుగా ఉంటున్నారు. మిషన్ భగీరథలోని జనరేటర్ నడవాలంటే గంటకు 150–200 లీటర్ల డీజిల్ అవసరముంటుంది. అందులో ఎప్పటికి 200 లీటర్లు నిల్వ ఉంచాలి. సామర్థ్యం మేరకు డీజిల్ లేకపోవడంతో మంగళవారం వేకువజామున నడిపించకుండా వదిలేశారు. చివరకు ఉదయం 11.30 గంటలకు డ్రమ్ముల్లో తీసుకొచ్చి పోశారు. మిగతా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంటుండటంతోనే తరచూ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, అధికారులు పట్టించుకోవడంలేదని పాలకవర్గ సభ్యులు ఆగ్రహిస్తున్నారు. తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం వస్తోందని, జనరేటర్ ద్వారా పంపింగ్ చేసేలా చర్యలు తీసుకుంటామని డీఈఈ లచ్చిరెడ్డి పేర్కొన్నారు.


రెండు రోజులుగా ఇబ్బందులు

నగరంలోని ఎగువ ప్రాంతంలోని విద్యానగర్, రాంనగర్, అంబేద్కర్‌నగర్, జ్యోతినగర్ ప్రాంతాల్లోని ఏడు రిజర్వాయర్లకు జ్యోతినగర్ రిజర్వాయర్ నుంచి నీటిని పంపింగ్ చేస్తున్నారు. రెండు రోజులుగా రిజర్వాయర్లకు సకాలంలో నీరు చేరకపోవడంతో పంపిణీ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. నీటిశుద్ధి కేంద్రం నుంచి శుద్ధజలం రాకపోవడంతో వీధుల్లో సరఫరా సమయాలు మారిపోతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు నిలిచిపోగా, వేకువజాము నుంచి అయిదు గంటలు ఆపేయడంతో దీని ప్రభావం డివిజన్ల నీటి పంపిణీపై పడింది. ఉదయం 10 గంటలకు నీటి సరఫరా చేయాల్సిన ప్రాంతాలకు సాయంత్రం 4.30 గంటలకు నల్లా నీరు ఇచ్చారు. ఇలా సమయపాలన పూర్తిగా మారిపోయి అర్ధరాత్రి వరకు నీటి సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ఆ ప్రతిపాదనకు పదేళ్లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట స్వయంభూ క్షేత్రాన్ని మరో తిరుమలగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ తలంపునకు నాటికి పదేళ్లు నిండనున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన యాదగిరిగుట్ట క్షేత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో యాదాద్రిగా పేరు మార్చి అరెకరంలోని దేవాలయాన్ని 4.03 ఎకరాలకు విస్తరించి సంపూర్ణంగా కృష్ణశిలతో ఆవిష్కృతం చేశారు. ఆలయంతో పాటు ఇతర వనరులతో క్షేత్రాభివృద్ధి కోసం సుమారు రూ.1200 కోట్ల ఖర్చైనట్లు వైటీడీఏ చెబుతోంది.

రాష్ట్ర సాధనకు ఉద్యమిస్తున్న దశలోనే 2007లో కేసీఆర్ ఈ క్షేత్ర సందర్శించారు. ఆలయాన్ని విశ్వఖ్యాతి గాంచేలా పునర్నిర్మించాలని తలచారు. నాటి ఆలోచనను సీఎం హోదాలో 2014 అక్టోబరు 17న వెల్లడించారు. కొండకింది పెద్దగుట్ట పై సేకరించిన 850 ఎకరాలో లేఅవుట్ పనులతో విశాల రహదారులు, హరితమయ ప్రాంగణాలు, కాటేజీల నిర్మాణానికి ప్లాట్ల ఏర్పాటుతో 250 ఎకరాలు రూపుదిద్దుకున్నాయి.కొండ కింద ఉత్తర ముఖంగా సేకరించిన భూముల్లో ఆలయానికి చెందిన వనరులతో ఆధ్యాత్మిక వాడగా రూపొందింది. సమీపాన చిన్న కొండ పై వీఐపీల బస కోసం 14 విల్లాలు, ఒక ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మించిన విషయం తెలిసిందే. భక్తుల పుణ్యస్నానాలకు లక్ష్మీపుష్కరిణి నిర్మించారు. కళ్యాణ కట్ట, వ్రత



మండపం, అన్న ప్రసాదం అందించే సముదాయం, ఆర్టీసీ బస్టేషన్ నిర్మించారు.కొత్తగా కొండపైన భక్తులు నిద్ర చేసేందుకు డార్మిటరీ హాల్, గుండంలో సంకల్ప స్నానం, ప్రసాదాల కొనుగోలు కోసం ప్రత్యేక టికెట్ కౌంటర్లు, సాంస్కృతిక కార్యక్రమాలను దేవస్థానం నిర్వహిస్తోంది.దేవాలయ విమానం స్వర్ణమయం రూపకల్పనకు ఈ మధ్యే శ్రీకారం చుట్టారు. 60 కేజీల బంగారంతో స్వర్ణవిమానం రూపకల్పనకు ప్రస్తుత రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో, స్థానిక ఎమ్మెల్యే, విప్ బీర్ల అయిలయ్య ఆధ్వర్యాన యాదాద్రి దేవస్థానం సదరు పనులకు నడుం బిగించిన విషయం తెలిసిందే.

# అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందండిలా..

ఆలేరు : విద్య, ఉపాధి, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఇదే క్రమంలో వారికి ఆయా దేశాల్లోని పరిస్థితులు, అవసరాల నేపథ్యంలో డ్రైవింగ్ లైసెన్స్‌లు అవసరం అవుతోంది. విదేశాలలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన శిక్షలు అనుభవించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విదేశాలకు వెళ్లేవారిలో చాలామంది అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ (ఐడీఎల్) కోసం రవాణాశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సరైన అవగాహన లేక దళారులను ఆశ్రయిస్తూ అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానంపై కథనం.

ఉన్నత విద్య కోసం...ఉన్నత విద్య అభ్యసించడానికి అమెరికా, గ్రేట్ బ్రిటన్, కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, రష్యా తదితర దేశాలకు వెళుతున్నారు. ఆయా దేశాలకు వెళ్లినవారిలో కొందరు అక్కడే స్థిర పడుతుండగా, మరికొందరు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆయా దేశాలలో కారు తప్పని సరైంది. ఈ క్రమంలో చాలామంది ఐడీఎల్‌ను తీసుకుంటున్నారు.

లెర్నింగ్ లైసెన్స్ మాదిరిగానే..

రాష్ట్ర రవాణాశాఖ జారీచేసే అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. దీని ఆధారంగా ఆయా దేశాలలో వాహనాలు నడపడానికి అనుమతిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే మనదేశంలో పొందిన ఐడీఎల్ ఆయా దేశాలలో లెర్నింగ్ లైసెన్స్‌లా ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. అక్కడి నిబంధనలకు లోబడి గడువులోగా అక్కడి లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.

వీసాను జతచేయాలి..

అంతర్జాతీయ లైసెన్స్ పొందాలంటే ముందుగా స్వదేశంలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఐడీఎల్‌కు దరఖాస్తు చేసే సమయంలో ఇక్కడ తీసుకున్న డీఎల్‌తో పాటు పాస్‌పోర్టు (గడువు 6 నెలలైనా ఉండాలి), మనం ఏ దేశానికైతే వెళుతున్నామో ఆ దేశానికి సంబంధించిన వీసాను జతచేయాలి.వీసా త్వరగా వస్తుందనుకుంటే అందుకు సంబంధించిన ఆధారాలు అందజేయాలి. ఆరోగ్యపరంగా వైద్య ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఫాం–ఎ జతచేసి పూర్తి వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. రుసుం ఆన్‌లైన్లోనే చెల్లించాలి. కేటాయించిన తేదీన ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. అన్నీ సక్రమంగా ఉంటే ఐడీఎల్‌ను జారీ చేస్తారు.నల్గొండ ఉమ్మడి జిల్లాలో 1.1.2020 నుంచి 30.9.2024 వరకు సుమారు 1,700 మంది వరకు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకున్నారు. నల్గొండ జిల్లాలో 720, సూర్యాపేట 600, యాదాద్రి భువనగిరి జిల్లాలో 380 వరకు తీసుకున్నారు.

అమెరికాలో ఇలా...


అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే కఠిన నిబంధనలు ఉంటాయి. మనదేశంలో మాదిరిగానే లెర్నింగ్ లైసెన్స్ తీసుకోవడానికి ముందు టెస్ట్ ఉంటుంది. అందులో ఉత్తీర్ణులైతేనే లెర్నింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. అనంతరం డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం కూడా టెస్ట్ రాయాల్సి ఉంటుంది. డ్రైవింగ్ పరీక్ష నిర్వహించేప్పుడు పక్కన ఎంవీఐ కూర్చుని మన డ్రైవింగ్‌ను పరిశీలిస్తారు. సెన్సార్ల ద్వారా మన చోదనను పరిశీలించడంతో పాటు ఫొటోలు కూడా తీస్తారు. డ్రైవింగ్ చేసేప్పుడు పొరపాట్లు చేస్తే వాటిని రుజువులుగా చూపుతూ లైసెన్స్ జారీని తిరస్కరిస్తారు.

# యూరియా.. ఎందుకు అమ్మడం లే..!

సూర్యాపేట : ఉమ్మడి నల్గొండ జిల్లాలో వరి, పత్తి, ఇతర పంటల సాగుకు వివిధ రకాల ఎరువులు వినియోగిస్తున్నారు. వీటిని గరిష్ఠ చిల్లర (ఎమ్మార్పీ) ధరకు లభ్యమయ్యే ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)లో రైతులు కొనుగోలు చేసేలా వెసులుబాటు కల్పించారు. పీఏసీఎస్‌లలో అన్ని రకాల ఎరువులు విక్రయించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా.. కొందరు సీఈవోలు పట్టించుకోవడం లేదు. దీంతో దూరంలో ఉన్న పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లి అధిక ధరకు ఎరువులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ధరలతో పాటు రవాణా ఛార్జీల భారం పడుతోందని వాపోతున్నారు.

ఉచిత రవాణా సౌకర్యం ఉన్నా..

సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా 115 పీఏసీఎస్ కేంద్రాలున్నాయి. ఈ సంఘాలకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఎరువులను ఉచితంగా రవాణా చేస్తారు. ఈ అవకాశం ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో 22 సహకార సంఘాల వారు యూరియా తీసుకొచ్చి విక్రయించడం లేదు. దీంతో ఆ సంఘాల పరిధిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు డీలర్లు యూరియా విక్రయించాలంటే వారే రవాణా ఖర్చులు భరించి దుకాణానికి తెచ్చుకోవాలి. దీంతో ప్రైవేటు వ్యాపారులు యూరియా కావాలంటే ఇతర ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని రైతులపై ఒత్తిడి తెస్తున్నారు.



కారణాలు ఇలా..గోదాము లేకపోవడంతో ఎరువులకు స్థలం దొరక్క పీఏసీఎస్ నిర్వాహకులు నిల్వ చ్టేసుకోవడం లేదు.

యూరియా విక్రయించేందుకు, దిగుమతి, ఎగుమతి నిల్వ వివరాలు రాసుకునే సిబ్బంది, హమాలీలు లేకపోవడం.

ప్రభుత్వం నుంచే సరైన (దొడ్డు రకం) యూరియా సరఫరా కాకపోవడం.

కమీషన్‌పైనే దృష్టి

అన్ని సంఘాల్లో డీఏపీ, 20–20, భారత్, ఐఎఫ్ఎఫ్‌సీవో, తదితర ఎరువులను విక్రయించాల్సి ఉంది. కానీ, ఇచ్చిన ఎరువులు మాత్రమే తీసుకోవాలని రైతులకు నిబంధన పెడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే రూ.కోట్లు కమీషన్ తీసుకుంటున్న సహకార సంఘాల నిర్వాహకులు యూరియా సరఫరా చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విక్రయించాలని ఆదేశించాం – పద్మ, డీసీవో, సూర్యాపేట

అన్ని సహకార సంఘాల్లో ఎరువులు విక్రయించాలని ఆదేశించాం. కొన్ని సంఘాల్లో విక్రయించడం లేదని మా దృష్టికి వచ్చింది. వెంటనే వాటిని తనిఖీ చేసి అందుకు గల కారణాలు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వచ్చే యాసంగిలో అన్ని సహకార సంఘాల్లో విక్రయించేలా చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

# అమ్మ ఆరోగ్యం.. బిడ్డకు శ్రేయస్కరం

కరీంనగర్ : గర్భిణుల ఆరోగ్యంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 'అమ్మ కోసం' అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. వారిలో వచ్చే థైరాయిడ్, మధుమేహం, రక్తహీనతతోపాటు రక్తపోటు, క్యాన్సర్ తదితర సమస్యలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. జిల్లాలో రక్తహీనత సమస్యతో బాధపడే వారు ఎంతమంది ఉన్నారు? ఆ ఇబ్బందిని ఎలా అధిగమించాలి? వారు ఏయే ఆహారం తీసుకోవాలి? అసలు సమస్య రాకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు.

**నేర్చుకున్న అంశాలపై సామర్థ్య పరీక్ష**

అమ్మకోసం యాప్ ద్వారా రోజూ ఏఎన్‌ఎంలకు చరవాణిలో దృశ్య, శ్రావణం ద్వారా గర్భిణులకు అందించే వైద్యసేవలపై వివరిస్తారు. ప్రధానంగా గర్భిణుల్లో రక్తహీనతను సకాలంలో గుర్తించి ముందే నివారణ చర్యలు తీసుకుంటే కాన్పు సమయంలో ఎదురయ్యే ఎక్కువ ప్రమాద స్థాయి (హైరిస్క్)ని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. ఏఎన్‌ఎంలు విని, నేర్చుకున్న అంశాలపై వారి సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఆన్‌లైన్‌లో వారికి పరీక్షతోపాటు క్విజ్ పోటీలు నిర్వహించారు.

**ప్రతి నెల గర్భిణి ఆరోగ్య స్థితి పరిశీలన..**

ప్రతి నెల గర్భిణి ఆరోగ్య పరిస్థితి, పిండం ఎదుగుదలను పరిశీలిస్తారు. గర్భం దాల్చిన మూడు నెలల నుంచి వైద్య సేవలు అందిస్తారు. ప్రమాదకర స్థాయి పరిస్థితిలో ఎలాంటి వైద్యం అందించాలి. ఎక్కడకు తీసుకెళ్లాలని అంశాలపై ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పిస్తారు. నెలనెలా నిర్వహించే వైద్య పరీక్షలను ఎప్పటికప్పుడు పరిశీలించి.. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే వెంటనే నివారణకు వైద్యులను సంప్రదిస్తారు. గర్భిణులు మధుమేహం బాధితులుంటే.. పుట్టే బిడ్డకు సోకకుండా వైద్యుల సూచనతో మందులు అందించాలి. ఎలాంటి ఆహార నియమాలు పాటించాలో అవగాహన కల్పిస్తారు.

**పుస్తక రూపంలో అందించాం**

గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎక్కువ ప్రమాదకరస్థాయి విధానాన్ని గుర్తించడం, నివారణ చర్యలపై రోజువారి కార్యక్రమాలు యాప్ ద్వారా తెలుసుకుంటున్నాం. ఇప్పటికే గ్రామాల్లో గర్భిణులను గుర్తించి వారికి వైద్యసేవలు, సూచనలు అందిస్తున్నాం. గతంలో పుస్తక రూపంలో అందించి ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులకు ఉపయోగకరంగా ఉంటుంది.
తిరుమల, లక్ష్మీదేవిపల్లి ఏఎన్‌ఎం

**ఎప్పటికప్పుడు పరీక్షలు**

గర్భిణులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేసేందుకు 'అమ్మ కోసం' యాప్ ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నాం. తెలుసుకున్న అంశాలపై రాత పరీక్షతోపాటు క్విజ్ పోటీలు నిర్వహించారు. గర్భిణులు మొదట్నుంచి బలవర్ధక ఆహారం తీసుకోవడంతోపాటు సానుకూలంగా ఉండేలా చుట్టూ పరిస్థితులను అనుకూలంగా ఏర్పాటు చేసుకోవాలి. తాము ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యంపై వాకబు చేస్తాం.
శ్రీలత, గంగాధర ఏఎన్‌ఎం

**ప్రసవం తర్వాత ప్రత్యేక దృష్టి**

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం తర్వాత ఏడాది వరకు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడకుండా ఈ కార్యక్రమం ద్వారా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇప్పటివరకు అత్యవసరంగా భావించిన 689 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్యం అందించాం. 1097 మందికి సాధారణ పరీక్షలు నిర్వహించాం. గర్భం దాల్చిన నుంచి ప్రసవం జరిగే వరకు తమ శాఖ తరఫున అవసరమైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నాం. సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

# బంగారు రుణం.. ప్రగతికి ప్రయోజనం

తాండూరు : వ్యాపార కేంద్రంగా పేరొందిన తాండూరులో బంగారం తాకట్టు రుణాలు ఏటా పెరుగుతున్నాయి. రూ.కోట్లల్లో రుణ మంజూరులో ఏకంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే గత ఆర్థిక సంవత్సరంలో ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రథమ స్థానంలో నిలిచింది. దీనికి సంబంధించి కథనం.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వేదికగా..ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 49 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. తాండూరు మండలంలో ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతోంది. 33 పంచాయతీల్లోని 2200మందికిపైగా రైతులు సభ్యులుగా నమోదయ్యారు. ఈ సంఘం ద్వారా ఏటా రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంట రుణాల్ని పంపిణీ చేస్తున్నారు. 2012లో శ్రీకారం

ఈ సహకార సంఘం ద్వారా బంగారం తాకట్టు రుణాల్ని మంజూరు చేయడం 2012 సంవత్సరంలో ప్రారంభించారు. రూ.10లక్షలతో ప్రారంభమైన రుణాల పంపిణీ పన్నెండు సంవత్సరాల్లో ఏకంగా




రూ.21.32కోట్లకు చేరింది. ఇప్పటివరకు 17వేల మందికిపైగా పొందారు. గత ఆర్థిక సంవత్సరంలో రుణాల పంపిణీలో సంఘానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొదటిస్థానం దక్కింది. ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహకార సంఘాల మాజీ అధ్యక్షులు బుయ్యని మనోహర్‌రెడ్డి అధికారుల్ని అభినందించారు.

**తీరుతున్న అవసరాలు**రుణాలు పొందుతున్న వారిలో వ్యాపారులే ఎక్కువ. పిల్లల ఉన్నత చదువులకు, వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాల కొనుగోలుకు స్వీకరణ.చిన్నతరహా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు, స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేందుకు వినియోగం.

ఇప్పటికే వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు మరింత విస్తరించేందుకు, కొత్తగా మరిన్నిచోట్ల వ్యాపారాలను ప్రారంభించేందుకు స్వీకరణ.

**అడిగిన వెంటనే ఇస్తున్నాం**వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు పంట రుణాలు, డీఏపీ యూరియా అందజేస్తున్నాం. దీంతోపాటు బంగారం తాకట్టు రుణాల్ని మంజూరు చేస్తున్నాం. ముఖ్యంగా రైతులకు సాగుకు సకాలంలో ఉపయోగపడే విధంగా అండగా నిలిచేందుకు యత్నిస్తున్నాం. పోటీని తట్టుకొని ఎక్కువ మందికి రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇతర అవసరాల వారు సైతం కేంద్రంలో సంప్రదించవచ్చు. – శ్రీనివాస్, సీఈఓ, ఎల్మకన్నె సహకార సంఘం, తాండూరు.

# అరకొర వసతులు.. అన్నదాత అవస్థలు



కోనరావుపేట : ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అన్నదాతలు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే అక్కడ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాల ప్రారంభానికి ముందు ధాన్యం రాశులుగా పోయడానికి వీలుగా పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించి చదును చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో కేంద్రాల్లో నెలకొన్న సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 1.70 లక్షల పైగా ఎకరాల్లో వరిసాగు చేశారు. 3 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 25 వేల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ ఆధ్వర్యంలో 44, డీసీఎంఎస్ 8, మెప్మా 4 మొత్తం 258 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తేమశాతం 17 ఉండాలి. క్వింటాల్‌కు ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300, సన్నరకానికి మద్దతు ధరతో పాటు రూ.500 అదనంగా బోనస్ ప్రభుత్వం ప్రకటించింది.

**ఇవి కల్పించాలి...**

రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వ నిబంధనల మేరకు శుభ్రం చేయడానికి కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి.

కేంద్రాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా తొలగించి చదును చేయించాలి.అకాల వర్షం, తేమశాతం బారిన పడకుండా కాపాడుకోవటానికి సరిప డా టార్పాలిన్లను ప్రభుత్వం సమకూర్చాలి.

ధాన్యం శుద్ధి చేయటానికి ప్యాడీ క్లీనర్, తేమశాతం సరిచూసే పరికరాలు అందుబాటులో ఉంచాలి.శుద్ధజలంతోపాటు సేదదీరడానికి పూరి గుడిసెలు ఏర్పాటు చేయాలి.విద్యుత్తు దీపాలు లేక అంధకారం నెలకొంది. రాత్రి వేళ వాచ్‌మెన్ అందుబాటులో లేక ధాన్యం దొంగతనానికి గురయ్యే ప్రమాదం ఉంది.

**పది రోజులు అయింది**

నేను వానాకాలంలో 8 ఎకరాల్లో వరి సాగు చేశాను. పది రోజుల క్రితం 3 ఎకరాల్లోని ధాన్యం తీసుకొచ్చి కొనుగోలు కేంద్రంలో పోశాను. సేకరణ ప్రారంభిస్తే తేమశాతం వచ్చిన ధాన్యం తూకం వేయడానికి అవకాశం ఉంటుంది. కొందరు రైతులు కేంద్రాలు ప్రారంభించకపోవటంతో మధ్యదళారులు, మిల్లర్లకు రూ.1900 నుంచి రూ.2000 విక్రయిస్తున్నారు. మెరుగైన వసతులు కల్పించి తూకాల్లో జాప్యం లేకుండా చూడాలి.
ఎర్ర దేవయ్య, రైతు, ధర్మారం

రెండు మండలాల్లో ప్రారంభంజిల్లాలో ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి బుధవారం ప్రారంభించాం. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించేలా చూడాలని పీఏసీఎస్ సీఈవోలకు ఆదేశాలు జారీ చేశాం. రైతులు నిబంధనల మేరకు ధాన్యం తీసుకురావాలి. కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటాం. రామకృష్ణ డీసీవో

# రైల్వే ఆధునికీకరణ నత్తనడక



వికారాబాద్ : ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 'అమృత్ భారత్' కింద శ్రీకారం చుట్టింది. తెలంగాణలో 15 రైల్వే స్టేషన్లు ఎంపిక చేయగా దీన్లో వికారాబాద్, తాండూరు కూడా ఉన్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్రం వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో రద్దీ ఎక్కువ. దీని పునర్ నిర్మాణానికి రూ.24.35 కోట్లు మంజూరు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించి మూడు నెలలు కొనసాగిన తరువాత ఆగిపోయాయి. అసంపూర్తి పనులతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు.

**ముఖచిత్రమే మారిపోతుందన్నారు**

రైల్వే స్టేషన్ ముఖ చిత్రం మార్చే విధంగా ఆధునిక హంగులతో స్టేషన్ భవనం, ఫ్లోరింగ్ నిర్మాణానికి ముఖ ద్వారాన్ని, విశ్రాంతి గదిని కూల్చివేశారు. మొదట కవర్ ఆఫ్ ప్లాట్ ఫాం కింద షెడ్ల విస్తరణ చేపట్టారు. ప్రయాణికులకు సౌకర్యంగా నీడనిచ్చే విధంగా షెడ్లు నిర్మాణ పనులు మొదలు పెట్టి వదిలేశారు. స్టేషన్ పేరు తెలిపే బోర్డులను సైతం తొలగించి ప్లాట్‌ఫాంపై పెట్టారు. పిల్లర్లకు గుంతలు తవ్వారు. కొత్తగా లిఫ్‌ను ఏర్పాటు చేశారు. తరువాత వీటి పురోగతిని పట్టించుకోవడం మానేశారు

**నిత్యం 15,000 మంది రాకపోకలు**

ఈ స్టేషన్ మీదుగా ముంబయి, బెంగళూర్, బీదర్, పుణె, షిర్డీ, తిరుపతి, గుంటూరు, పల్నాడు తదితర ప్రాంతాలకు నిత్యం 25 రైళ్లు నడుస్తాయి. రూ.4 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. వికారాబాద్ ప్రాంత వాసులే కాకండా సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ ప్రాంత వాసులు ఇక్కడి నుంచి ప్రయాణాన్ని సాగిస్తారు. హైదరాబాద్‌లో ఉంటూ వికారాబాద్‌లో విధులు నిర్వహించే వారు కూడా రైలులో వచ్చివెళుతుంటారు. ఇలా నిత్యం 15 వేల మంది రైలులో ప్రయాణిస్తుంటారు.

**పనుల్లో వేగం పెంచుతాం**

వికారాబాద్ రైల్వే జంక్షన్‌లో కొనసాగుతున్న ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచుతాం ఇటీవల నేను స్వయంగా స్టేషన్‌లో కొనసాగుతున్న విశ్రాంతి గదుల అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించా. పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని వేగం పెంచి నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించా. తగు చర్యలు తీసుకుంటాం. బర్తేష్‌కుమార్ జైన్, డీఆర్ఎం, సికింద్రాబాద్.నిజాం నవాబుల కాలంలో..స్వాతంత్ర్యానికి ముందు సికింద్రాబాద్ నుంచి వాడి వరకు రైల్వే లైన్‌ను ఏర్పాటు చేశారు. నిజాం తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలను అనుసంధానిస్తూ రైల్వే లైన్‌ను వేశారు. మధ్యలో వికారాబాద్ ఉండటంతో ఇక్కడ రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. రద్దీ స్టేషన్ కావటంతో 2010లో ఆదర్శ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేశారు. ఆ తర్వాత గత ఫిబ్రవరిలో మరోసారి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

# రాయితీ ఇచ్చేద్దాం.. తుక్కుగా మార్చేద్దాం..

హైదరాబాద్: 15 ఏళ్లు దాటిన వాహనాలను తుక్కుగా మార్చాలనే కేంద్రం నిర్ణయానికి అనుగుణంగా గ్రేటర్ చుట్టూ మూడు ప్రాంతాల్లో తుక్కు కేంద్రాల ఏర్పాటుకు రవాణాశాఖ చర్యలు చేపడుతోంది. శంషాబాద్ నందిగామ, వర్గల్, తూప్రాన్‌లో వీటి ఏర్పాటుకు ప్రాథమికంగా పరిశీలన చేసింది. ఇప్పటికే ఓ ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీతో పాటు మరో రెండు కంపెనీలు రిజిస్టర్ వెహికల్ తుక్కు కేంద్రాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

గ్రేటర్ వ్యాప్తంగా 15 ఏళ్లు దాటిన వాహనాలు 18 లక్షలు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం 15 ఏళ్లు దాటిన వాహనాలను ఫిట్‌నెస్ చేసిన తర్వాత హరిత పన్ను చెల్లించి, మరో అయిదేళ్లు నడుపుకోవచ్చు.

తుక్కు పాలసీ కింద.. ఈ వాహనాలను తుక్కుగా మార్చాలి. ఇది నిర్బంధం కాకపోవడంతో ఎంతమంది స్వచ్ఛందంగా ముందుకొస్తారనేది అనుమానమే.

స్వచ్ఛందంగా ముందుకొచ్చి.. తుక్కు కింద మార్చితే.. కొత్త వాహనాలు కొనుగోలు సందర్భంగా రాయితీలు ఇవ్వనున్నారు.

తుక్కుకు ఖరీదు కట్టి, అందులో కొంతమేర యజమానులకు చెల్లిస్తారు.

**వింటేజ్ వాహనాలపై రాని స్పష్టత..**

తుక్కు పాలసీ నేపథ్యంలో వింటేజ్ వాహనాలు ఏం చేస్తారనేది దానిపై ఎక్కువ మంది ఆరా తీస్తున్నారు. నగరంలో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ ఏళ్లు దాటిన కార్లు, ఇతర వాహనాలు ఉన్నాయి. పూర్వీకుల



నుంచి వచ్చిన ఆస్తిగా చాలామంది వీటిని జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. గ్రేటర్‌వ్యాప్తంగా 50 వేల వరకు ఇలాంటి వాహనాలు ఉన్నట్లు అంచనా. తుక్కు పాలసీ నేపథ్యంలో వింటేజ్ వాహనాలపై ప్రత్యేక నిర్ణయం తీసుకుంటారా? లేదా అనే విషయంలో స్పష్టత లేదు. గ్రీన్ ట్యాక్స్ చెల్లించి కొందరు ఈ వాహనాలను వినియోగిస్తున్నారు. మరికొందరు అసలు బయటకే తీయడం లేదు. త్వరలో వింటేజ్ వాహనాలకు సంబంధించి విధివిధానాలపై స్పష్టత వస్తుందని ఓ అధికారి తెలిపారు.

# భూబ్యాంకులో భద్రం

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) మహా భూ బ్యాంకు సిద్ధం చేసింది. ఇప్పటివరకు వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతోపాటు పలు సంస్థలకు కేటాయింపులు, లేఅవుట్లకు పోను ఇంకా 5,364 ఎకరాల వరకు ఉంది. ఇటీవల ఆక్రమణలు ఎక్కువగా జరుగుతుండటంతో అసలు లెక్కలు బయటకు తీసింది. ఏడు జిల్లాల పరిధిలో ఎంత భూమి ఉందో సరిచూసింది. దీంతో రూ.వేల కోట్ల విలువైన భూములు హెచ్ఎండీఏ ఖాతాలో ఉన్నట్లు తేలింది. ఈ బ్యాంకులోని భూములను కాపాడుకునేందుకు హెచ్ఎండీ కసరత్తు చేయడంతోపాటు భవిష్యత్తులో వీటిని వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు వాడుకునే వెసులుబాటు ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భూములు అధిక ధర పలుకుతుండటంతో ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

**భవిష్యత్తు అవసరాలకు...**

మహానగరం విస్తరిస్తోంది. ఇప్పటికే గ్రేటర్ దాటి అవుటర్ రింగ్ రోడ్డు వరకు నిర్మాణాలు వెలుస్తున్నాయి. రీజనల్ రింగ్ రోడ్డు తర్వాత మహానగర పరిధి దాదాపు 8 వేల చదరపు కిలోమీటర్ల వైశాల్యం పెరగనుంది. అప్పటి అవసరాలకు అనుగుణంగా వివిధ ప్రాజెక్టులకు భూమి చాలా కీలకం. ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాలంటే ప్రభుత్వ ఖజానాపై భారం పడక తప్పదు. దీంతో హెచ్ఎండీఏ భూ బ్యాంకు కాపాడుకుంటే భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టులకు వెదుక్కోవాల్సిన అవసరం ఉండదు. అయితే భూముల ధరలు పెరుగుతున్న కొద్దీ ఆక్రమణదారుల నుంచి కాపాడుకోవడం హెచ్ఎండీఏకు పెద్ద సవాలుగా మారుతోంది. తొలుత చిన్న చిన్న గుడిసెలు వేసి...వాటికి




దొంగ సర్వే నెంబర్లు సృష్టిస్తున్నారు. నెమ్మదిగా పక్కా ఇళ్లు నిర్మిస్తున్నారు. వాటిని కూల్చడానికి వెళితే కోర్టులకు వెళ్లి స్టేలు తీసుకొస్తున్నారు. ఈ భూముల రక్షణ కోసం హెచ్ఎండీఏ పకడ్బందీగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**జీపీఎస్‌తో అనుసంధానం..**

శేరిలింగంపల్లిలోని మియాపూర్‌లోని సర్వే నంబరు 100, 101లో హెచ్ఎండీఏకు 445.340 ఎకరాలు ఉండగా.. ఇటీవల ఇందులో పెద్దఎత్తున ఆక్రమణలకు పాల్పడ్డారు. కొందరు నేతలు ప్రోద్బలంతో గుడిసెలు వేయగా...అధికారులు అతికష్టం మీద అడ్డుకున్నారు. ప్రస్తుతం ఈ భూమి చుట్టూ హెచ్ఎండీఏ కంచె నిర్మిస్తోంది. జీపీఎస్‌తోనూ అనుసంధానం చేయనున్నారు. భవిష్యత్తులో ఎవరైనా సర్వే రాళ్లు తొలగించి హెచ్ఎండీఏ భూమిలోకి చొచ్చుకొచ్చినా జీపీఎస్ కోఆర్డినేట్స్ చూసి తొలగించే అవకాశం ఉంది.

కాప్రా మండలం జవహర్‌నగర్‌లోని వివిధ సర్వే నంబర్లలో 2370 ఎకరాలు ఉండగా...ఇందులో ఇప్పటికే వివిధ అవసరాల కోసం 795 ఎకరాలు కేటాయించారు. ఇంకా 1574.300 ఎకరాలు హెచ్ఎండీఏ ఖాతాలో ఉంది. ఈ భూమికి సరైన రక్షణ లేక ఆక్రమణల పాలవుతోంది. దాదాపు ఆరేడు వందల ఎకరాలకు సంబంధించి కోర్టు కేసులు నడుస్తున్నాయి. చాలాచోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

# బిల్డర్ల నుంచే బాధితులకు పరిహారం..?

బాచుపల్లిలో చెరువును ఆనుకొని ఎఫ్‌టీఎల్‌లోనే ఓ బడా నిర్మాణ సంస్థ రెండు టవర్లను కట్టింది. సుమారు వెయ్యి మంది ఒక్కో ఫ్లాట్‌ను రూ.80లక్షల నుంచి రూ.కోటిన్నరకు కొనుగోలు చేశారు. ఈ ఫ్లాట్లను హైడ్రా కూల్చేస్తే అందులో ఉంటున్న వారంతా రోడ్డున పడే అవకాశం ఉంది. మూసాపేటలోనూ ఓ చెరువు ఎఫ్‌టీఎల్‌ను మార్చేసి ఓ నిర్మాణ సంస్థ అపార్టుమెంట్ల నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేసింది. నగరంలో అక్రమ నిర్మాణాలు భారీగానే ఉన్నాయి. ఇందులో కొన్నింటికి తప్పుడు పత్రాలతో అనుమతులు పొందారు. నిబంధనల ప్రకారం వీటిని హైడ్రా కూల్చివేయాల్సిందే. ఒకవేళ ఇదే చేస్తే ఎన్నో ఏళ్ల కిందట వాటిని కొనుగోలు చేసిన సామాన్యులు రోడ్డునపడతారు. ఇలాంటి నిర్మాణాల కూల్చివేతల విషయంలో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటే బాగుంటుందనే భావనలో హైడ్రా అధికారులున్నారు. వీరికి బిల్డర్ల నుంచి పరిహారం ఇప్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. రెండ్రోజుల కిందట హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇదే విషయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వివరించారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించాలని మంత్రి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై త్వరలో సర్కార్ విధానపరమైన నిర్ణయం తీసుకోనుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**రెండు నెలలు బ్రేక్...**

సుమారు 2 వేలకుపైగా కట్టడాలు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్నాయి. వీటిలో చాలా వాటికి బల్దియా, హెచ్ఎండీఏ, పంచాయతీలు



అనుమతులు ఇచ్చాయి. ఈ విషయంలో అధికారులు నిబంధనలను తుంగలోకి తొక్కినట్లు తెలుస్తోంది. కొందరు బిల్డర్లు ఒక సర్వే నంబరులో అనుమతులు తీసుకొని మరో సర్వే నంబరులో ఇళ్లను నిర్మించారు. వీటిని వేలాది మంది కొనుగోలు చేశారు. వీటన్నింటినీ కూల్చితే కొనుగోలు చేసిన వారు తీవ్రంగా నష్టపోతారని, ఇది ప్రభుత్వ వ్యతిరేకతకు దారితీసే అవకాశం ఉందని ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీనిపై సీనియర్ మంత్రులతో చర్చించి ఒక విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాలని సీఎం నిర్ణయించారని అధికారవర్గాలు చెబుతున్నాయి. బిల్డర్ నుంచి కొనుగోలుదారులకు పరిహారం ఇప్పించాలని యోచిస్తున్నారు. మూసీ విషయంలోనూ దీన్నే అవలంబిస్తారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు నెలలపాటు ఎటువంటి కూల్చివేతలు చేపట్టకూడదని హైడ్రా నిర్ణయించింది.

# ఉచితంగా వెలుగులు

నల్గొండ : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. వాటి బలోపేతం లక్ష్యంగా ఉచిత విద్యుత్తు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో బడులకు విద్యుత్తు భారం తప్పనుంది. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో 3480 ప్రభుత్వ పాఠశాలలతో పాటు 510 ప్రభుత్వ వసతి గృహాలు, కళాశాలలు, ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటన్నింటికీ ఉచిత విద్యుత్తు పొందే అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలకు ఉచిత విద్యుత్తు అందించేందుకు విద్యుత్తు శాఖ ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ రూపొందించాలని నిర్ణయించింది.

విద్యా సంస్థలు ఏ శాఖ పరిధిలోకి వస్తే సంబంధిత ఉన్నతాధికారికి పోర్టల్ లాగిన్ సదుపాయం కల్పించనున్నారు. సదరు అధికారి విద్యా సంస్థలకు ఉచిత సర్వీసుల వివరాలు నమోదు చేయడం, తొలగించటం, సవరణ చేయడం వంటి అవకాశం కల్పిస్తారు. విద్యాలయాల సర్వీసుల బిల్లులను సంబంధిత శాఖకు వచ్చే బడ్జెట్ నుంచి ప్రతి



నెల విద్యుత్తు సంస్థలకు చెల్లించాల్సి ఉంటుంది. విభాగాధిపతులకు బడ్జెట్ కేటాయింపుల నుంచి బిల్లులు చెల్లించటానికి వీలుగా ఆన్‌లైన్ పోర్టల్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖతో అనుసంధానిస్తారు. ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తాంపాల్‌రాజు, ఎస్ఈ, విద్యుత్తు సంస్థ నల్గొండ సర్కిల్ ప్రభుత్వ విద్యాలయాలకు ఉచిత కరెంటు అందించాలని ప్రభుత్వం ఆదేశిస్తే అమలు చేస్తాం. విద్యుత్తు సంస్థ ఉన్నతాధికారుల నుంచి ఇంకా జిల్లాకు అందలేదు. ఉత్తర్వులు రాగానే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత కరెంటు పథకం అమలు చేస్తాం.

# ఆంక్షల నీడ.. ప్రశాంతత బాట

ఆసిఫాబాద్ : జైనూర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి అవసరమైన చర్యలు చేపట్టే దిశగా అదనపు డీజీ మహేశ్ భగవత్, ఇతర అధికారులు శుక్రవారం సైతం జైనూర్‌లోనే ఉన్నారు. మండల కేంద్రంలో అన్ని కాలనీల్లో తిరుగుతూ పర్యవేక్షణ చేశారు. అల్లర్లను నివారించడంలో, ముందుగా పసిగట్టడంలో విఫలమైనందున ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్యను కాగజ్‌నగర్‌కు బదిలీ చేసి, ఆయన స్థానంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను నియమించారు. ఆందోళనలో వాటిల్లిన నష్టంపై డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే చేస్తున్నారు. ఇరు వర్గాల ప్రత్యేక డిమాండ్లను ఇప్పటికే తీసుకున్న అధికారులు వాటిని అమలు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఓ వర్గానికి చెందిన వ్యక్తులు ప్రార్థన మందిరానికి వెళ్లడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో పోలీసులు అడ్డుకున్నారు. గుంపుగా చేరిన వ్యక్తులను చెదరగొట్టడానికి స్వల్పంగా లాఠీఛార్జీ చేశారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పాలనాధికారులు, ఎస్పీలు, పుర, డీపీవోలతో ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వినాయక చవితి ఏర్పాట్లను సమీక్షించారు. తప్పుడు ప్రచారాలు చేసే సామాజిక మాధ్యమాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు.

**అంతర్జాల సేవలు లేక అవస్థలు**

జైనూర్‌లో మహిళపై అత్యాచార యత్నం, దాడి ఘటన ఉద్రిక్తతకు దారి తీసిన విషయం తెలిసిందే. అల్లర్లలో కాలిపోయిన దుకాణాల్లో మిగిలిన సరకులు తీసుకుని బాధితులు శుక్రవారం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఉన్న దుకాణాల్లోని సామగ్రిని సైతం సర్దుకుని ప్రజలు ఇతర ప్రాంతాలకు, బంధువుల ఇళ్లకు తరలిపోతున్నారు. అడుగడుగునా పోలీసుల ఆంక్షలతో ఆసిఫాబాద్ నుంచి జైనూర్‌కు వెళ్లే మార్గంలో 20 కిలోమీటర్ల ముందే వాహనాలను ఆపేస్తున్నారు. ఉట్నూర్ వైపు



పది కిలోమీటర్ల దూరంలో వాహనాలను నిలిపివేయడంతో ప్రజలు నడుచుకుంటూ రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానికంగా ఔషధాల దుకాణాలు సైతం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రజలు ఇప్పటికీ ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా అంతర్జాల సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**ఛార్జిషీట్ తర్వాతే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు**

జైనూర్‌లో మహిళపై అత్యాచార యత్నం, దాడి కేసుకు సంబంధించి ఛార్జిషీట్ అనంతరమే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటయ్యే అవకాశం ఉందని రాష్ట్ర స్థాయి పోలీసు ఉన్నతాధికారి అన్నారు. ఇందుకు ప్రభుత్వ అనుమతి పొంది, జీఓ విడుదల అనంతరమే ప్రత్యేక కోర్టులో విచారణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. విచారణ సైతం నెల రోజుల్లో పూర్తవుతుందని స్పష్టం చేశారు.

# అధ్వాన రోడ్డు.. వాహనదారుల తిప్పలు



మంథని: మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీకి వెళ్లే రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. వాహనదారులు తరచూ ప్రమాదానికి గురవుతున్నారు. పూర్వం ఈ మార్గంలో పంట పొలాలకు వెళ్లేందుకు మట్టిదారి ఉండేది. పది సంవత్సరాల క్రితం సింగరేణి సంస్థ బిట్టుపల్లి శివారులో అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి రచ్చపల్లి, అక్కెపల్లి, లద్నాపూర్ భూ నిర్వాసితుల కోసం పునరావాస కాలనీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రూ.రెండు కోట్ల వ్యయంతో ఒకవరుస తారురోడ్డు నిర్మించారు. ఈ మార్గంగుండా మంథని మండలంలోని బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలంలోని సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. సంవత్సరం క్రితం ఖమ్మంపల్లి నుంచి భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన నిర్మించి ప్రారంభించడంతో ఈ రహదారిపై రోజుకు వందల సంఖ్యలో వాహనాలు వెళుతున్నాయి. ఈ రహదారిపై జనగలంత వాగు నీటితో పాటు బిట్టుపల్లి పెద్దచెరువు నీరు ప్రవహించడంతో వాహనదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు కిలోమీటర్ల పాటు ఈ రోడ్డులో అనేక మలుపులు ఉండటంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో ఉన్న కాజ్‌వే వద్ద వంతెన నిర్మాణంతోపాటు రహదారిని రెండు వరుసలుగా విస్తరించాల్సి ఉంది. సింగరేణి సంస్థ భూనిర్వాసితుల కోసం నిర్మించిన రహదారిని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలకు అప్పగించక పోవడంతో ప్రభుత్వ పరంగా రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు కావడం లేదు. పునరావాస కాలనీ కోసం ఏర్పాటు చేసిన రహదారికి సింగరేణి సంస్థ మరమ్మతులు చేపట్టాలని రచ్చపల్లి వాసులు కోరుతున్నారు.

**మరమ్మతులు చేపట్టాలి**

సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకు ఉన్న రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఈ రహదారి 10 గ్రామాలతోపాటు భూపాలపల్లి జిల్లా వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. గుంతలమయంగా ఉన్న రోడ్డుపై వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వానా కాలంలో రోడ్డుపై నీరు పారడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పునరావాస కాలనీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కాజ్‌వే వద్ద సింగరేణి సంస్థ వంతెన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

**నాగరాజు రచ్చపల్లిరోడ్డు ప్రమాదాలను నివారించాలి**

సూరయ్యపల్లి - రచ్చపల్లి రహదారి ఇరుగ్గా ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నివారించాలి. రహదారి గుంతల మయంగా మారి అందులో వరదనీరు నిలుస్తోంది. మలుపు అధికంగా ఉండటంతో వాహనచోదకులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి పూర్తిగా ధ్వంసమైంది. పునరావాస కాలనీలో సదుపాయాల కల్పనకు సింగరేణి సంస్థ చర్యలు చేపట్టాలి. కొడారి రాకేష్ రచ్చపల్లి

# అక్రమాలకు అడ్డదారులు




కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయ పరిధిలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ గందరగోళంగా మారుతోంది. ఆసుపత్రులలో పుట్టిన పిల్లలకు, ఆసుపత్రులు, ఇళ్లలలో చనిపోతున్న వారికి మరణ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలంటే నానావస్థలు పడుతున్నారు. పైగా తప్పులు సవరించుకోవాలంటే కత్తి మీద సాములాగా తయారైంది. గతంలో ఎన్నడూ లేని నిబంధనలు అమలు చేస్తుండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారు. వారికి దరఖాస్తు చేసుకొని ధ్రువపత్రాలు సాధించాలంటే గగనంగా మారింది.

నగరానికి చెందిన ఒక వ్యక్తి ఇటీవల చనిపోయారు. మార్గమధ్యలో మరణించడంతో ఆసుపత్రి నుంచి ఆన్‌లైన్‌లో రికార్డు రాలేదు. పోలీసు ఎఫ్ఐఆర్ ప్రకారం దరఖాస్తు చేస్తే గెజిటెడ్ సంతకం లేదని కొర్రీలు పెట్టారు. చివరకు గెజిటెడ్ సంతకం, కోర్టు అఫిడవిట్ తీసుకొస్తే అప్పుడు ఆమోదించారు.

జనన ధ్రువీకరణ పత్రంలో తండ్రి పేరు తప్పుగా నమోదు చేశారు. దీనిని సవరించుకోవడానికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు జత చేసి మీసేవలో దరఖాస్తు చేశారు. కొద్ది రోజులకు తిరస్కరించారు. ఎందుకని ఆరా తీస్తే గతంలో తీసుకున్న ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రం అందించలేదని సాకుగా చూపించారు.

దరఖాస్తుదారులు నేరుగా దరఖాస్తు చేసుకుంటే లేని పోని కారణాలతో ఇబ్బందులకు గురి చేస్తుండగా.. అడ్డదారుల్లో వచ్చే వారికి, తిమ్మిని బమ్మిని చేసి అధికారులను ఇరకాటంలో పెట్టే వారికి మాత్రం చకచకా ధ్రువపత్రాలు జారీ కావడం విమర్శలకు దారి తీస్తోంది.

**చెప్పేవారుండరు..**

జిల్లాలోని పురపాలికలు, నగరపాలికల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేయడం కష్టంగా మారింది.

వీటికి ఎలాంటి పత్రాలు జత చేయాలనే విషయం చెప్పే వారుండరు.

మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు తప్ప, దానికి ఏం జత చేయాలనే విషయాన్ని అక్కడ, పురపాలికల్లో వివరించే వారు లేరు.

కనీసం నోటీసు బోర్డులపై దేనికి ఏం అవసరముంటుందో వివరించి రాయకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

**పైరవీకారులదే హవా**

జనన, మరణ ధ్రువపత్రాలు తీసుకోవడానికి ఒకటెండ్రు సార్లు దరఖాస్తుదారులు వచ్చి బేజారు అయి చివరకు పైరవీకారులను ఆశ్రయించే పరిస్థితి వస్తోంది. వీరంతా కార్యాలయంలో కనిపించకపోయినా ఆరు బయట, ఇతర ప్రాంతాల నుంచి వ్యవహారం నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జవాన్లు కూడా విచారణ సమయంలో సక్రమంగా చేయకపోవడం, పైరవీకారులను నమ్మి ఆధారాలు తారుమారు చేయడంతో బతికి ఉన్నా, చనిపోయినట్లుగా రికార్డుల్లో నమోదు అవుతున్నాయి. కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులకు సరైన సమాచారం ఇవ్వకపోవడంతోనే అక్రమాలకు తావిస్తున్నారు.

**సమస్యలుంటే ఫిర్యాదు చేయాలి**

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ కావాలంటే సరైన ఆధారాలతో కూడిన పత్రాలు జత చేయాల్సిందే. ఏ ఒక్కటీ లేకున్నా ఇబ్బందులు వస్తున్నాయి. అన్నీ సవ్యంగా ఉండి సమస్యలు వస్తే నేరుగా వచ్చి ఫిర్యాదు చేయొచ్చు.సువార్త, అదనపు కమిషనర్, నగరపాలిక

# నాలా.. దశ మారేలా

రాయదుర్గం: భారీ ఆక్రమణలతో కునారిల్లిన రాజధానిలోని నాలా వ్యవస్థను గాడిలో పెట్టాలని హైడ్రా కార్యాచరణ రూపొందించింది. రెండు దశల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని హైడ్రా నిర్ణయించింది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో వందమంది అధికారులు, సిబ్బంది పరిశీలన మొదలుపెట్టారు. నాలాలపై వరదకు అడ్డుపడుతున్న భవనాలను గుర్తించనున్నారు. అనంతరం రెండు దశల్లో వాటిని కూల్చివేయనున్నారు.


వందల కాలనీల నుంచి ఫిర్యాదులు.. నగరంలో పెద్ద నాలాలు 390 కిలోమీటర్ల పొడవున ఉంటే వీటికి అనుబంధంగా మరో 1200 కిలోమీటర్ల పొడవున నాలాలు ఉన్నాయి. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో దాదాపు 70 శాతం నాలాలపై అక్రమ నిర్మాణాలు వెలిశాయి. నాలాలను కాపాడాలని దాదాపు 300ల కాలనీలకు చెందిన వారు హైడ్రాకు విన్నవించారు. ఈనేపథ్యంలో తొలుత పూర్తిగా నాలాలను ఆక్రమించిన చోట్ల వారం పది రోజుల్లో కూల్చివేతలను మొదలు పెట్టనున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. రెండో దశ కింద మూడొంతులు ఆక్రమించిన ప్రాంతాలను గుర్తించి కూల్చివేతలు చేపడతామని ప్రకటించారు.

మొదటి దశ: నాలాను పూర్తిగా ఆక్రమించడం వల్ల వర్షం నీరు దిగువకు వెళ్లలేని ప్రదేశాలను గుర్తించి అక్కడ కూల్చివేతలు చేపడతారు.

రెండో దశ: ఆక్రమణల వల్ల నాలా మూడొంతులు కుంచించుకుపోయిన ప్రాంతాలను గుర్తించి అక్కడి అక్రమ భవనాలను నేలమట్టం చేస్తారు.

**జలవనరుల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు**

భూగర్భ జలాల పరిరక్షణలో కీలకంగా నిలిచే చెరువులు, కుంటల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. నానక్‌రాం గూడ రంగ్‌లాల్‌కుంట, భగీరథమ్మ చెరువులను ఆయనసందర్శించారు. ఆ జలవనరుల్లో స్థలాలను ఆక్రమించారని, పలు నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులు



రావడంతో ఆయన పర్యటిం చారు.

**ఫిర్యాదులతో మార్కింగ్‌లు.. తాఖీదులు**

జంట జలాశయాల పరిధుల్లో అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఇప్పటివరకు 50 ఫిర్యాదులు వచ్చినట్టు తెలిసింది. దీంతో అధికారులు హిమాయత్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, బాకారంజాగీర్, కొత్వాల్‌గూడ, కవ్వగూడ, నర్కుడ రెవెన్యూ గ్రామాల్లో తిరిగారు. హిమాయత్‌నగర్, చిలుకూరు, అప్పాజిగూడ, చందానగర్, మోత్కుపల్లి ప్రాంతాలను పరిశీలించారు. అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ రెవెన్యూ గ్రామాల్లో హిమాయత్‌సాగర్ బఫర్‌జోన్‌ను గుర్తించి మార్కింగ్ చేశారు. అందులో నిర్మాణాలు చేసిన వారి చిరునామాలను గుర్తించి తాఖీదులు ఇవ్వనున్నారు.

పెద్దనాలాల పొడవు 390 కిలోమీటర్లు

అనుబంధ నాలాలు 1200 కిలోమీటర్లు

నాలాలపై ఆక్రమణలు 15 వేలు (చిన్నాపెద్దా)

# పంట వర్షార్పణం

గజ్వేల్: పంటలకు జీవం పోసి ఆదరువు అవుతాయనుకున్న వర్షాలు విరుచుకుపడి చేలను ముంచెత్తాయి. రైతులకు అపారనష్టం కలిగించాయి. వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటిదాకా 630 మంది రైతులకు చెందిన 943.2 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు.

**రెండెకరాల టమాట నేలపాలు:**

అప్పులు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టి 2 ఎకరాల్లో టమాట పంట వేశా భారీ వర్షాలకు చేనంతా మునిగియింది. మొక్కలు విరిగిపోయి పూత, కాత పూర్తిగా కుళ్లిపోయింది. రూ.1 లక్ష దాకా నష్టపోయిన.

కొంగరి లక్ష్మీనర్సయ్య, గంగాపూర్, చిన్నకోడూరు మండలం

**ఆదుకుంటేనే గట్టెక్కుతాం: బాల్‌రెడ్డి, మిరుదొడ్డి**

భారీ వర్షాల కారణంగా వరదలొచ్చి ఇసుక మేటలేశాయి. మూడు ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. ఇప్పటికే అప్పులు తెచ్చి రూ.30వేలదాకా ఖర్చు చేశా. ప్రభుత్వం ఆదుకుంటేనే గట్టెక్కుతాం.

**ఆశనిరాశైంది: వెంకట్‌రెడ్డి, మిరుదొడ్డి**

పంట బాగా పండితే లాభాలు వస్తాయని ఆశించా. భారీ వర్షాలొచ్చి



మొక్కజొన్న పంటంతా పాడైంది. రూ.50 వేలు పెట్టుబడి పెట్టి మూడు ఎకరాల్లో మొక్కజొన్న వేసిన.

**ఎనిమిది ఎకరాల పత్తి చేను నాశనం.. - బాల్‌రాజు, రిమ్మనగూడ, గజ్వేల్ మండలం**

ఎనిమిది ఎకరాలు కౌలు తీసుకుని పత్తి పంట సాగు చేశా. రూ.2 లక్షల మేర పెట్టుబడి పెట్టా. కూడవెల్లి వాగు పరివాహకం కావటంతో వరద ఉధృతి పత్తి పంట చేనుపైనుంచి వెళ్లింది. మొక్కలన్నీ కొట్టుకుపోయాయి. పెట్టుబడి, కౌలు రెండు విధాలుగా నష్టపోయిన.

**నీరు తొలగించి, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: - బాబునాయక్, ఏడీఏ, గజ్వేల్**

భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పొలాల నుంచి వర్షపు నీరుబయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. వెంటవెంటనే పురుగు మందులు పిచికారీ చేయొద్దు. వరి ప్రస్తుతం దుబ్బు చేసే దశలో ఉన్నందున బ్యాక్టీరియా, ఎండు ఆకు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. రైతులు 0.2 గ్రాముల ప్లాంటమెసిన్‌ను లీటరు నీటికి కలిపి వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలి. స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

# ఐటీడీఏ.. పాలక మండలి నిర్వహణపై పట్టింపేది?

జయశంకర్ : ఐటీడీఏ పాలక మండలి సమావేశం మూడు నెలలకోసారి జరగాలి. అది నిర్వహించక ఐదేళ్లవుతోంది. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో పారదర్శకత లోపిస్తోంది. సమావేశం జరిగితే పథకాల అమలుపై సమగ్ర చర్చ జరగడంతో పాటు అమల్లో లోపాలు, అవకత వకలపై పాలకమండలిలో సభ్యులైన ప్రజాప్రతినిధులు ప్రశ్నించే అవకాశం ఉంటుంది. అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది..

ఇదీ పరిస్థితి.. : పాలకమండలి సమావేశం నిర్వహించిన తర్వాత వచ్చే సమావేశం ఎప్పుడు ఏర్పాటు చేస్తారో తీర్మానిస్తారు. ఏ ఒక్కటి కూడా తీర్మానం చేసిన సమయానికి జరిగిన దాఖలాలు లేవు.

57వ పాలకమండలి సమావేశాన్ని 2015 ఏప్రిల్ 8న... ఆ తర్వాత 14 నెలలు ఆలస్యంగా 58వ పాలక మండలి 2016 జూన్ 15న జరిగింది. ఏడాది తర్వాత 2017 జూన్ 8న 59వ సమావేశం నిర్వహి ంచారు. ఆ తర్వాత 60వ పాలకమండలి 2019 డిసెంబర్ 20న జరిపారు. ఇలా ప్రతిసారి ఎంతో ఆలస్యం అవుతోంది. 2020 మార్చిలో నిర్వహించాల్సిన 61వ పాలకమండలి సమావేశం ఇప్పటి వరకు జరగలేదు. రెండు దశాబ్దాల ఐటీడీఏ చరిత్రలో మూన్నెల్లకోసారి జరిగింది లేదు.

**అస్తవ్యస్తంగా పథకాల అమలు**

2020-21 ఆర్థిక సంవత్సరానికి 1,264 మంది గిరిజనులకు రూ.11.66 కోట్ల రాయితీ పథకాలు అందించాలని లక్ష్యంగా ఎంచుకున్నారు. 820




మందికి రూ.7.24 కోట్లు మంజూరు చేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి 5,497 మందికి రూ.43.98 కోట్ల రాయితీని వివిధ పథకాలకు అందించాల్సి ఉన్నా.. ఈ రెండు ఆర్థిక సంవత్సరాలకు ఇప్పటివరకు 956 మందికి రూ.8.74 కోట్ల రాయితీని మాత్రమే ఇచ్చారు. బ్యాంకర్ల విముఖత కారణంగా కొందరికి ప్రయోజనం కలగలేదు. ఇదే తరహాలో గతంలోనూ రాయితీ రాక ఐటీడీఏ చుట్టూ తిరిగి విసిగిపోయిన గిరిజనులెందరో ఉన్నారు.గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం ద్వారా 2022-23 నుంచి 2023-24 వరకు వివిధ గ్రాంట్ల కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.679.84 కోట్లతో 753 అభివృద్ధి పనులు చేపట్టింది. తారు, సీసీ రోడ్లు, పంచాయతీ భవనాలు, గిరిజన భవనాలు, పాఠశాలల్లో అదనపు తరగతి గదులు వంటి పనులను చేపట్టారు. వీటి ప్రగతి నివేదికలు, నాణ్యతా ప్రమాణాల గురించి అడిగేవారు లేరు.

2017-18 లో రూరల్ ట్రాన్స్‌పోర్టేషన్ పథకాన్ని ప్రవేశపెడితే 168 మంది నిరుద్యోగ గిరిజన యువతను ఎంపిక చేసి రూ.4.83 కోట్ల రాయితీతో వివిధ రవాణా వాహనాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. దీనిపై ఊసే లేదు. ఎంఎస్ఎంఈ పథకం కింద మొత్తం 24 యూనిట్లు మంజూరవ్వగా, అందులో 15 యూనిట్లు లబ్ధిదారు లకందించారు. ఇంకా తొమ్మిది యూనిట్లు ఇవ్వలేదు..

ఈ అంశంపై ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాను వివరణ కోరగా త్వరలో 61వ పాలకమండలి సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఎజెండా అంశాలకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని.. పాలకమండలి సభ్యుల అనుమతి తీసుకుంటామని చెప్పారు.

**ఆలస్యం చేయకుండా నిర్వహించాలి**

**- వట్టం జనార్దన్, తుడుందెబ్బ జిల్లా నాయకుడు**

ఆలస్యం చేయకుండా ఐటీడీఏ పాలకమండలి సమావేశాన్ని నిర్వహించాలి. అమలవుతున్న పథకాలు, కేటాయిస్తున్న నిధులపై చర్చించాలి. అవినీతికి తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.




# విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం

అమరావతి: అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు పునఃప్రారంభించారు. సీఆర్‌డీఏ ఆఫీసు పనులను ప్రారంభించి ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయుని పాలెం వద్ద పనులు ప్రారంభించారు. భవన ప్రాంగణంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ పూజా కార్యక్రమం నిర్వహించారు. రూ.160 కోట్లతో గతంలో తెదేపా హయాంలో ఏడంతస్తుల్లో సీఆర్‌డీఏ కార్యాలయ పనులు చేపట్టారు. ప్రాజెక్టు కార్యాలయ నిర్మాణాన్ని 2017లో ప్రారంభించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను నిలిపేశారు. మొత్తం 3.62 ఎకరాల్లో జీ ప్లస్ 7 భవనాన్ని ఇక్కడ ప్రభుత్వం నిర్మిస్తోంది. అదనంగా పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్‌కు 2.51 ఎకరాల విస్తీర్ణం కేటాయించారు. ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్స్, ఇంటీరియర్స్, ఎలక్ట్రిక్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. "చరిత్రను తిరగరాసేందుకు మనమంతా ఇక్కడ సమావేశమయ్యాం. రాష్ట్ర విభజన సమయంలో అనేక ఇబ్బందులు పడ్డాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైబరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దిన ఘనత మాదే. ముందుచూపుతో ఆనాడే సైబరాబాద్‌లో 8 వరుసల రోడ్లు వేశాం. శంషాబాద్ విమానాశ్రయానికి 5 వేల ఎకరాలు ఎందుకని అందరూ ప్రశ్నించారు. అభివృద్ధికి అడ్డుపడే వారు ప్రతిచోటా ఉంటారు. అమరావతి రైతులను ఒప్పించి భూమి సేకరించాం. రాజధాని, సమాజ హితం కోసం మీరంతా భూములు ఇచ్చారు. అమరావతి కోసం 54 వేల ఎకరాలు సేకరించాం. మహిళా రైతులు వైకాపా ప్రభుత్వంపై గట్టిగా పోరాడారు" "రాష్ట్రానికి మధ్యలో ఉండే ప్రాంతం.. అమరావతి. ఒక రాష్ట్రం, ఒక రాజధాని అని.. ప్రతిచోటా చెప్పాను. విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం. కర్నూలులో హైకోర్టు బెంచ్, పరిశ్రమలను ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు వెల్లడించారు.




# కడప జిల్లాలో దారుణం.. ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి

బద్వేల్: కడప జిల్లా బద్వేలు సమీపంలోని సెంచరీ ప్లైవుడ్ వద్ద ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి ఘటన కలకలం రేపింది. విద్యార్థినిని రోడ్డు పక్కనే చెట్లలోకి తీసుకెళ్లి విఘ్నేశ్ అనే యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని స్థానికులు కడప రిమ్స్‌కు తరలించారు. ఘటనపై బద్వేలు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమ పేరుతో 8వ తరగతి నుంచే విఘ్నేశ్ .. తమకు కుమార్తెను వేధిస్తున్నాడని బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. అతనికి వివాహమైనా వేధింపులు ఆపలేదని, ఇవాళ పెట్రోల్ పోసి నిప్పంటించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని నుంచి జిల్లా జడ్జి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు.

**నిందితుడి కోసం నాలుగు బృందాలతో గాలింపు: ఎస్పీ–** "గాయపడిన ఇంటర్ విద్యార్థినికి కడప రిమ్స్‌లో చికిత్స కొనసాగుతోంది. 80శాతం గాయాలయ్యాయి. చిన్నప్పటి నుంచి ఇద్దరికీ పరిచయం ఉంది. ఇద్దరూ బద్వేలు రామాంజనేయనగర్‌కు చెందినవారే. తనను కలవాలని విద్యార్థినికి విఘ్నేశ్ ఫోన్ చేశాడు. కలవకపోతే చనిపోతానని ఆమెను బెదిరించాడు. ఇద్దరూ పీపీకుంట చెక్‌పోస్టు సమీపంలోని ముళ్ల పొదల్లోకి వెళ్లారు. విద్యార్థినిపై పెట్రోల్ పోసి నిప్పంటించి విఘ్నేశ్ పరారయ్యాడు. నిందితుడి ఆచూకీ కోసం నాలుగు బృందాలతో గాలింపు చేపట్టాం" అని కడప ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు.

**నిందితుడిని అరెస్టు చేయండి ...** ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి ఘటనపై సీఎం చంద్రబాబు అధికారులతో మాట్లాడారు. ఆమె ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని, నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని అధికారులను ఆదేశించారు.

# వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు రెండ్రోజులపాటు పోలీసు కస్టడీ



మంగళగిరి : వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పోలీసు కస్టడీకి తరలించారు. వెలగపూడిలో మరియమ్మ అనే మహిళ హత్య కేసులో నందిగం సురేష్ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో రిమాండ్ ఖైదీగా గుంటూరు జైలులో ఉన్న సురేష్‌ను కస్టడీకి ఇవ్వాలని తుళ్లూరు పోలీసులు పిటిషన్ వేయగా.. మంగళగిరి కోర్టు అనుమతించింది. దీంతో తుళ్లూరు పోలీసులు నందిగం సురేష్‌ను గుంటూరు జిల్లా జైలు నుంచి తుళ్లూరుకు తరలించారు. తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో రెండు రోజులపాటు నందిగం సురేష్‌ను పోలీసులు విచారించనున్నారు. అనంతరం సోమవారం మధ్యాహ్నంలోపు గుంటూరు జిల్లా జైలుకు తరలిస్తారు.




# చేసిందంతా చేసి.. నీతులు చెబుతున్నారా..!

ఆంధ్రప్రదేశ్‌లో దోపిడి రాజ్యమేలుతోందంటూ మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షులు జగన్ వ్యాఖ్యానించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఓసారి తన పాలనను గుర్తుచేసుకున్నారేమోనని కొందరు.. ప్రజల దృష్టి మరల్చేందుకు అసత్య ప్రచారానికి తెరలేపారని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఇప్పటివరకు ప్రవేశపెట్టలేకపోయిందని జగన్ చెప్పారు. అదే సమయంలో ఈ పరిస్థితికి తానే కారణమని జగన్ మాత్రం చెప్పుకోలేకపోయారు. ఓ రాష్ట్రం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలంటే.. ఆర్థిక వనరులు ఉండాలి. అప్పులపై రాష్ట్రాన్ని నడిపిస్తే ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందో కొన్ని దేశాల ఆర్థిక పరిస్థితిని చూస్తే అర్థమవుతోంది. 2019 నుంచి 2024 వరకు సీఎంగా ఉన్న జగన్.. ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల రాష్ట్రంగా మార్చారనే విమర్శలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ఖజనాను పూర్తిగా ఖాళీ చేయడంతో పాటు.. ఆదాయ వనరులను పెంచేందుకు ఎటువంటి ప్రయత్నం చేయలేదనేది బహిరంగ రహస్యం. చెప్పుకోదగ్గ పరిశ్రమలను తీసుకురావడంలో జగన్ ఫెయిల్ అయ్యారనే ప్రచారం జరిగింది. ఉపాధి, ఉద్యోగ కల్పనలోనూ వైసీపీ ప్రభుత్వం విఫలమయ్యారనే చర్చ జరిగింది. వీటన్నింటిని మర్చిపోయి ప్రస్తుత ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను పెట్టలేకపోయిందని విమర్శించడంతో.. కూటమి నేతలు జగన్‌కు కౌంటర్ ఇచ్చే పనిలో పడ్డారు. రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు సర్వనాశనం చేసి వదిలేయడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని, ప్రస్తుతంత రాష్ట్రంలో ఆర్థిక వనరులను, ఆదాయ మార్గాలను పెంచే పనిలో ప్రభుత్వం ఉందని, గత వైసీపీ ప్రభుత్వంలా అంకెల గారడీతో ప్రజలను మోసం చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని కూటమి నేతలు చెబుతున్నారు. ఓ రకంగా జగన్ గత అసమర్థ పాలన కారణంగానే కొత్త ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల తర్వాత కూడా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేకపోయిందనే చర్చ జరుగుతోంది.

**దోచుకో.. పంచుకో.. తినుకో..** తన పాలనలో డీబీటీకి ప్రాధాన్యత ఇస్తే చంద్రబాబు పాలనలో దోచుకో.. పంచుకో.. తినుకో (డీపీటీ) విధానాన్ని అవలంభిస్తున్నారని జగన్ విమర్శించారు. రాజకీయంగా ఎన్ని విమర్శలైనా చేయవచ్చు. కానీ జగన్ ఈ వ్యాఖ్యలు చేసే ముందు తన ఐదేళ్ళ పాలనను గుర్తు చేసుకుని చేశారేమోననే అనుమానాలు రాష్ట్ర ప్రజలకు కలుగుతున్నాయట. సరిగ్గా జగన్ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ఈ విధానాన్నే ఫాలో అయ్యారని, దాని కారణంగానే ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారనే ప్రచారం సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత జోరుగా వినిపించింది.

భూ కబ్జాలు, ప్రతి కాంట్రాక్ట్‌లో కమీషన్ల విధానం జగన్ ప్రభుత్వంలో సాగిందని, తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిపై వేధింపులు, అక్రమ కేసులకు వైసీపీ ప్రభుత్వం కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందనే చర్చ జరిగింది. తన ప్రభుత్వంలో ఉన్నట్లే ప్రస్తుత ప్రభుత్వంలో జరుగుతుందనే భ్రమలో ఉండి జగన్ ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారని కొందరు కూటమి పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మరికొందరైతే చేసిందంతా చేసి.. జగన్ ఇప్పుడు నీతులు చెబుతున్నారా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారట.




# పన్నూ కేసు అభియోగాల వేళ.. రా మాజీ అధికారి అరెస్టు వెలుగులోకి..!

దిల్లీ: సిక్కు వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర జరిగిందన్న ఆరోపణలపై అమెరికా దర్యాప్తు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా భారత మాజీ ఇంటెలిజెన్స్ అధికారి వికాస్ యాదవ్‌పై ఇటీవల అభియోగాలు నమోదవ్వడం చర్చనీయాంశమైంది. వికాస్ పరారీలో ఉన్నట్లు అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ నోటీసులు జారీ చేసింది. ఈ తరుణంలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఆ అధికారిని దిల్లీ పోలీసులు గతేడాది ఓ కిడ్నాప్, దోపిడీ కేసులో అరెస్టు చేసినట్లు జాతీయ మీడియాల్లో కథనాలు వెల్లడించాయి. దిల్లీలోని రోహిణీ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి గతేడాది డిసెంబరులో వికాస్ యాదవ్‌పై ఫిర్యాదు చేశాడు. వికాస్‌తో తనకు 2023 నవంబరులో పరిచయం ఏర్పడిందని, కొంతకాలం పాటు టచ్‌లో ఉన్నామని చెప్పారు. అయితే, గతేడాది డిసెంబరులో ఓ హోటల్‌కు పిలిచి తనపై దాడి చేసి దోపిడీకి యత్నించాడని పేర్కొన్నారు. దీంతో గతేడాది డిసెంబరు 18న వికాస్, అతడి అనుచరుడిని దిల్లీ పోలీసులు అరెస్టు చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. దీనిపై ఈ ఏడాది మార్చిలో ఛార్జిషీట్ దాఖలు చేయగా.. ఆ మరుసటి నెలలోనే వికాస్‌కు బెయిల్ మంజూరైనట్లు తెలుస్తోంది. పన్నూ హత్యకు కుట్ర కేసులో అతడిపై అభియోగాలు నమోదైన వేళ.. ఈ వార్తలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కుట్ర కేసుకు సంబంధించి న్యూయార్క్‌లోని కోర్టులో న్యాయశాఖ ఛార్జిషీట్ దాఖలు చేసింది. అందులో భారత పౌరుడైన వికాస్‌యాదవ్ (39)పై మనీలాండరింగ్, కుట్రకు వ్యక్తులను నియమించడం, పన్నూ హత్యకు ప్రణాళిక రచించడం వంటి అభియోగాలు మోపారు. ప్రస్తుతం ఆయన ఆచూకీ తెలియరావడం లేదని అందులో పేర్కొన్నారు. వికాస్ గతంలో భారత ప్రభుత్వ అధికారిగా విధులు నిర్వహించారు. భారత విదేశీ ఇంటెలిజెన్స్ విభాగం, రా విభాగాన్ని నిర్వహించే కేబినెట్ సెక్రటేరియట్‌లో ఉద్యోగిగా పనిచేశారు. అమెరికా గడ్డపై పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని తాము భగ్నం చేశామని అగ్రరాజ్యం గతేడాది ఆరోపించిన సంగతి తెలిసిందే. భారత ప్రభుత్వ ఉద్యోగితో కలిసి పన్నూను హత్య చేసేందుకు నిఖిల్ గుప్తా కుట్ర పన్నారని అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఇప్పటికే చెక్ రిపబ్లిక్ జైలులో ఉన్న నిఖిల్‌ను అమెరికాకు అప్పగించినట్లు ఆ మధ్య మీడియా కథనాలు వెల్లడించాయి. అటు ఈ కేసు వ్యవహారంపై అమెరికా కోర్టు భారత ప్రభుత్వానికి సమన్లు కూడా జారీ చేసింది. అయితే, ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన భారత్.. దీనిపై విచారణ జరిపేందుకు స్వదేశంలో ఓ దర్యాప్తు కమిటీని ఏర్పాటుచేసింది. ఈ క్రమంలోనే ఇటీవల భారత అధికారుల బృందం అమెరికాలోని విదేశాంగ శాఖ, న్యాయశాఖ అధికారులతో సమావేశమైంది. ఈ అభియోగాల్లో పేర్కొన్న భారత అధికారి ప్రస్తుతం ప్రభుత్వంలో పనిచేయడం లేదని న్యూదిల్లీ తమకు వెల్లడించినట్లు అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మాథ్యూ మిల్లర్ తెలిపారు. ఈ బృందం పర్యటన ముగిసిన తర్వాతే వికాస్ యాదవ్‌పై అగ్రరాజ్యం అభియోగాలు చేయడం గమనార్హం.

# మద్యం, ఇసుక దోపిడీపై జగన్ మాటలు హాస్యాస్పదం: మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి: మద్యం టెండర్లు, ఇసుక రవాణాలో దోపిడీ జరుగుతోందంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. అమరావతిలో శనివారం ఆయన మాట్లాడుతూ.. జగన్ ధన దాహంతో రాష్ట్రాన్ని పీల్చి పిప్పి చేశారని అన్నారు. కూటమి సర్కార్‌లో పారదర్శకంగా జరిగిన మద్యం విధానంపై విమర్శలు చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు. "ఎక్సైజ్ విభాగాన్ని నిర్వీర్యం చేసి వైసీపీ మద్యం పేరుతో దోచుకుంది నిజం కాదా? SEB పేరుతో అక్రమ మద్యం వ్యాపారానికి అడ్డులేకుండా చేసుకోవడం నిజం కాదా. తయారీ నుండి రిటైల్ అమ్మకాల వరకు అన్ని వ్యవస్థల్ని గుప్పిట్లో పెట్టుకొని ప్రభుత్వ షాపుల పేరుతో దోచుకున్నది నిజం కాదా? జగన్ కల్తీ మద్యం కారణంగా 50 లక్షల మంది కిడ్నీ, లివర్ సమస్యలతో సతమతమయ్యారు. ప్రభుత్వ షాపుల్లోనే వేలాది MRP ఉల్లంఘనలు జరగడంపై ఏం సమాధానం చెబుతావు? ఎన్నడూ లేని విధంగా 2019–24 మధ్య అక్రమ మద్యం రవాణా కేసులు ఎందుకు ఎక్కువగా నమోదయ్యాయి? వ్యవస్థల్ని నిర్వీర్యం చేసి ఇప్పుడు నీతులు చెప్పడానికి సిగ్గు పడాలి. రాష్ట్ర ఖజానాకు ఆదాయం తగ్గించి.. మీ ఆదాయం పెంచుకోవడం నిజం కాదా? కూటమి అధికారంలోకి వచ్చాక దేశ వ్యాప్తంగా ఉన్న మద్యాన్ని ఏపీలో అందుబాటులో ఉంచేలా పాలసీ తీసుకొచ్చాం. రూ.99 కే క్వార్టర్ అందించే ప్రయత్నం చేస్తున్నాం. రిటైర్డ్ జడ్జితో టెండర్ కమిటీ వేసి ధరల్ని నిర్ణయించబోతున్నాం. నీతులు చెప్తున్న జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో జరిగిన మద్యం అక్రమాలపై చర్చకు సిద్ధమా? కల్లు గీత కార్మికులకు కేటాయించిన షాపులకు త్వరలోనే దరఖాస్తులు స్వీకరిస్తాం. అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు జరిగింది. ప్రభుత్వంపై నమ్మకంతో 89,882మంది దరఖాస్తు చేసుకుని, దుకాణాలు ఏర్పాటు చేశారు. పునరావాసం కోసం అదనంగా 2 శాతం సెస్ అమలు చేస్తున్నాం. ఆదాయం పోయిందనే బాధతో జగన్ రెడ్డి దిక్కుమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలు ఊరుకోరు అని గుర్తుంచుకోండి. ఇసుక మొత్తాన్ని గుప్పిట్లో పెట్టుకొని దోచుకున్న ఘనత జగన్ రెడ్డికే చెందుతుంది. జగన్ రెడ్డి ఇసుక మాఫియా కారణంగా 70 మంది భవన నిర్మాణ కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. రూ.వెయ్యి కోట్లకు పైగా ప్రజా ధనాన్ని జగన్ బినామీ కంపెనీలతో కలిసి దిగమింగారు. మీ అక్రమాల కారణంగానే ఎన్జీటీ రూ.100 కోట్ల జరిమానా విధించింది. ఉన్నతాధికారులకు చీవాట్లు పెట్టింది. రాష్ట్రంలో 130 ఇసుక రీచులు ఎందుకు మూతబడ్డాయో సమాధానం చెప్పాలి. అధికారంలోకి రాగానే జులై 8 న ఉచిత ఇసుక పాలసీని ప్రకటించాం. అక్టోబర్ 15 వరకు ఇసుక తవ్వకాలకు ఎన్జీటీ అడ్డుకోవడం వాస్తవం కదా? ఐదేళ్ల పాలనా కాలంలో ఏ రోజైనా అందుబాటులో ఉన్న ఇసుక వివరాలు బయట పెట్టారా? విలువలు వదిలేసి రాజకీయం చేయడం జగన్ రెడ్డికి అలవాటుగా మారిపోయింది. ఆన్లైన్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చి ఎవరైనా ఇసుక బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించాం. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో ఉచితంగా ఇసుక తీసుకెళ్లొచ్చని నిర్ణయించాం. 8 జిల్లాల్లో డీసిల్టేషన్ కోసం అనుమతులు ఇచ్చి ఇసుక అందుబాటులో ఉంచాం. ఓపెన్ టెండర్లపై కూడా జగన్ రెడ్డి విమర్శలు చేయడం సిగ్గు చేటు. ఐదేళు వ్యవస్థల్ని నిర్వీర్యం చేసిన జగన్ రెడ్డి ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదం. సీనరేజి వసూళ్లను కూడా ఉపసంహరించుకున్నాం. కనీసం పారదర్శకత అంటే ఏంటో జగన్ రెడ్డికి తెలుసా? వ్యవస్థల్ని చెప్పు చేతుల్లో పెట్టుకుని రాష్ట్రాన్ని రావణకాష్టం చేసిన ఆయనకు ప్రజలు బుద్ధి చెప్పారు. పొరుగు రాష్ట్రాలకు తరలించినా, బ్లాక్ మార్కెట్ సృష్టించినా తీవ్ర చర్యలు ఉంటాయని వైసీపీ, జగన్ గుర్తుంచుకోవాలి" అని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

# రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజిన్ సర్కారు కృషి: లంకా దినకర్

విజయవాడ: గత ఐదేళ్లలో వైకాపా హయాంలో కేంద్ర నిధులు పక్కదారి పట్టించారని భాజపా నేత లంకా దినకర్ విమర్శించారు. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్ర సాధనకు అందరం కలిసి కృషి చేస్తామన్నారు. 20 సూత్రాలు అందరికీ తెలిసేలా అన్ని కలెక్టరేట్ల వద్ద ఉంచుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా రాష్ట్రానికి సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు వెంట తామంతా నడుస్తామని చెప్పారు. అర్హులైన అందరికీ పథకాలు అందించేందుకు సీఎం కృషి చేస్తున్నారని వివరించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజిన్ సర్కారు పనిచేస్తోందని లంకా దినకర్ తెలిపారు.



# త్వరలో వారి బండారాలన్నీ బయటపడతాయి.. సీఎం రమేష్ షాకింగ్ కామెంట్స్



విశాఖపట్నం: విశాఖపట్నంలో వైసీపీ నేత, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఇంటిపై ఈరోజు జరుగుతున్న ఈడీ సోదాలు ప్రారంభం మాత్రమేనని.. ఇంకా కొనసాగుతాయని బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. వైసీపీ నేతలు దోచుకున్న అవినీతి సొమ్ము మొత్తం కక్కించి ప్రజల కోసం ఉపయోగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వైసీపీ నేతల అక్రమార్జనలపై ఈడీ , సీబీఐలకు తాను ఫిర్యాదు చేశానని ఎంపీ సీఎం రమేశ్ వెల్లడించారు. త్వరలో మాజీ సీఎం జగన్?తో పాటు వైసీపీ అక్రమార్కుల బండారాలన్నీ బయటపడతాయి ... ఈడీ దాడులు ఆరంభం మాత్రమేనని సీఎం రమేశ్ పేర్కొన్నారు.

**మధురవాడ భూమి కొనుగోలు కేసులో ఈడీ సోదాలు...** కాగా.. మాజీ వైసీపీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ( నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మధురవాడ భూమి కొనుగోలు కేసులో తనిఖీలు చేపట్టిన అధికారులు ఏకకాలంలో పలు చోట్ల సోదాలు చేస్తున్నారు. విశాఖ లాసన్స్‌బే కాలనీలోని ఎంవీవీ ఇంట్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. మాజీ ఎంపీ సత్యనారాయణతోపాటు ఆయన ఆడిటర్ జీవీ నివాసంలోనూ సోదాలు సాగుతున్నాయి. హైగ్రీవా ఇన్‌ఫ్రాటెక్, కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయాల్లోనూ ఈడీ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. రూ. 12.5 కోట్ల లావాదేవీలకు సంబంధించిన వ్యవహారంలో ఎంవీవీపై ఈడీ ఇటీవల కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

**పలు చిత్రాలు నిర్మించిన ఎంవీవీ సత్యనారాయణ :** కేసు విచారణలో భాగంగా ఈడీ బృందాలు సోదాలు చేపట్టాయి. మరోవైపు హైగ్రీవా ఇన్‌ఫ్రాటెక్ ఓనర్ రాధారాణి, కంపెనీ ఎండీ జగదీశ్వరుడు ఇళ్లల్లోనూ తనిఖీలు చేస్తున్నారు. 2006–2008 మధ్య జరిగిన లావాదేవీలపై ఈడీ కేసు నమోదు చేయగా.. తాజాగా ఎంవీవీ ఆడిటర్ వెంకటేశ్వరరావుతోపాటు గద్దె బ్రహ్మాజీ ఇళ్లల్లోనూ సోదాలు చేస్తున్నారు.

# ఆరెంజ్ గౌనులో అంజలి హై గ్లామర్ డోస్


టాలీవుడ్ ఇండస్ట్రీలోనే కాకుండా సౌత్ ఇండియా మొత్తంలో బ్యూటిఫుల్ లుక్స్ తో ఆకట్టుకునే వారిలో అంజలి ఒకరు. తెలుగమ్మాయి అయినప్పటికీ కూడా అటు తమిళంలో కూడా మంచి హీరోయిన్ గా గుర్తింపును తెచ్చుకుంది. కెరీర్ మొదట్లోనే ఆమె జర్నీ లాంటి కంటెంట్ ఉన్న సినిమాలలో నటించి ప్రేక్షకులకు దగ్గరైంది. అంజలి ఏదైనా సినిమా చేస్తోంది అంటే తప్పకుండా అందులో ఒక మంచి కథాంశం ఉంటుంది అని చెప్పవచ్చు. ఆ విధంగా ఆమె తన స్టోరీ సెలక్షన్స్ తో ఎంతగానో అట్రాక్ట్ చేస్తూ ఉంటుంది. ఇక అంజలి సోషల్ మీడియాలో అప్పుడప్పుడు పోస్ట్ చేసే ఫోటోలు కూడా ఫాలోవర్స్ ను ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంటాయి. అంజలి కేవలం ట్రెడిషనల్ గానే కాకుండా గ్లామరస్ లుక్స్ తో కూడా తనకు తానే పోటీ అనేలా



కనిపిస్తూ ఉంటుంది. ఆమె ఎలాంటి ఫోటో పోస్ట్ చేసినా కూడా చాలా కొత్తగా ఉంటుంది. రీసెంట్ గా న్యూయార్క్ లో దిగిన మరికొన్ని గ్లామరస్ ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది. ఆరెంజ్ గౌనులో అంజలి గతంలో ఎప్పుడూ లేనంత అందంగా కనిపించింది అంటూ మరి కొందరు ప్రశంసలు అందిస్తున్నారు. అంజలి అందం ముందు ఎవరైనా పోటీ రాగలరా అంటూ మరికొందరు వారి స్టైల్ లో పొగిడేస్తున్నారు. తన క్యూట్ లుక్స్ తో ఎంతగానో ఎట్రాక్ట్ చేస్తున్న అంజలి ప్రస్తుతం తెలుగులోనే కాకుండా తమిళ సినిమాల్లో కూడా బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా మెగా పవర్ స్టార్ తో ఆమె నటించిన గేమ్ ఛేంజర్ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఆ సినిమాలో అంజలి క్యారెక్టర్ చాలా డిఫరెంట్ గా ఉండబోతుందట. ఇక రీసెంట్ గా గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలో కూడా ఒక ప్రయోగాత్మకమైన పాత్రలో కనిపించి విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకుంది. కేవలం సినిమాల వరకే పరిమితం కాకుండా అప్పుడప్పుడు మంచి కంటెంట్ ఉన్న వెబ్ సిరీస్ లు కూడా చేస్తోంది. మరి రాబోయే రోజుల్లో అంజలి ఇంకా ఎంత కొత్తగా కనిపిస్తుందో చూడాలి.

# హీటెక్కించేలా ఆ బ్యూటీ హాట్ సెల్ఫీ!

బాలీవుడ్ యంగ్ బ్యూటీ అలయ ఎఫ్ టెంప్టింగ్ ఎలివేషన్ల గురించి చెప్పాల్సిన పనిలేదు. అందాల ఆరబోతలో తనదైన మార్క్ వేస్తుంది. ఎప్పటికప్పుడు ఫ్యాషన్ ఎంపికల్లోనూ చూపరులను ఆకట్టుకుం టుంది. డిజైనర్స్ దుస్తుల్లో ఎలా ప్రోజెక్ట్ అవ్వాలో? పక్కాగా తెలిసిన బ్యూటీ. నలుగురిలా కాకుండా నాకో స్టైల్ ఉందంటూ రుజువు చేస్తుంటుంది. తాజాగా మరో హాట్ పిక్ కం వీడియో తో నెట్టింట్లోకి వచ్చేసింది. ఇదిగో ఇక్కడి బ్లాక్ కలర్ స్పోర్ట్స్ దుస్తుల్లో అలరించింది. లెగ్ ఎక్సరసైజ్ లు చేస్తూ తన లో బ్యూటీని సైతం హైలైట్ చేసింది. పనిలో పనిగా కెమెరా అన్ చేసి సెల్ఫీలు తీసుకుంది. ఎడమ కాలి పాదాన్ని పైకి కిందకు లిఫ్ట్ చేస్తూ థై భాగంలో కొవ్వును కరిగిస్తుంది. అమ్మడు జిమ్ వేర్స్ లో ఉన్నా? ఎంతో అందంగా ముస్తాబయ్యే



ఎక్సరసైజ్ లు షురూ చేసినట్లుంది. ఇది ఎంతో కఠినమైన ట్రైనింగ్ అంటూ క్యాప్షన్ కూడా ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో, వీడియో నెట్టింట వైరల్ అవుతున్నాయి. కామెంట్ బాక్సులో నెటి జనుల కామెంట్లు అంతే ఆసక్తికరం. అలయ బ్యూటీని పొగిడేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఇక అమ్మడి కెరీర్ సంగతి చూస్తే...'జవానీ జానెమాన్' చిత్రంతో బాలీవుడ్ లో అరంగేట్రం చేసిన ఆలయ తొలి ప్రయత్నంలోనే విమర్శకుల ప్రశంసలందకుంది. కొంత గ్యాప్ తర్వాత మొట్ట మొదటి మ్యూజిక్ వీడియోతో అభిమానుల ముందుకు వచ్చింది. ఇటీవల రెండు..మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చినా అవి ఆశించిన ఫలితాలు సాధించలేదు. అయినా అలయా జోరు ఏమాత్రం తగ్గలేదు. చేతినిండా అవకాశాలతో కనిపిస్తుంది.




# భీమ్ గెలిచాడు.. మరి రామరాజు?



ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కించిన RRR చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ గా నిలవడంతో.. జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ ల మార్కెట్ బాగా పెరిగిపోయింది. ఎవరికి ఎక్కువ పేరు వచ్చిందనేది పక్కన పెడితే, వీరిద్దరూ ఒక్కసారిగా పాన్ ఇండియా స్టార్ డమ్ సంపాదించారు. ఇద్దరి స్టార్ ట్యాగ్స్ కూడా మారిపోయాయి. ట్రిపుల్ ఆర్ తర్వాత ఇప్పటికే తారక్ 'దేవర 1' సినిమాతో మరో సక్సెస్ తన అకౌంట్ లో వేసుకున్నారు. దీంతో ఇప్పుడు అందరి దృష్టి చెర్రీ 'గేమ్ ఛేంజర్' పై పడింది. రాజమౌళితో సినిమా చేసి బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టిన హీరోలు, ఆ వెంటనే డిజాస్టర్లు రుచి చూస్తారనే ఓ బ్యాడ్ సెంటిమెంట్ ఇండస్ట్రీలో ఉంది. అయితే 'దేవర' చిత్రంతో హిట్టు కొట్టి మిథ్ బ్రేకర్ గా నిలిచాడు ఎన్టీఆర్. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఈ యాక్షన్ డ్రామా.. టాక్ తో సంబంధం లేకుండా బాక్స్ ఆఫీస్ వద్ద రూ. 500 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. ఈ నేపథ్యంలో రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' సినిమాతో ఎలాంటి విజయం సాధిస్తాడు? ఎన్ని కోట్ల వసూళ్లు రాబడతాడు? తారక్ మూవీ కలెక్షన్స్ ను క్రాస్ చేయగలడా? అంటూ రెండు సినిమాలను పోల్చి విశ్లేషణలు చేస్తున్నారు. 'గేమ్ ఛేంజర్' చిత్రానికి శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. చాలా కాలంగా మేకింగ్‌లో ఉన్న ఈ సినిమా ఎట్టకేలకు రిలీజ్ డేట్ లాక్ చేసుకుంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇది శంకర్ మార్క్ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ గా ప్రచారం చేయబడుతోంది. అయితే దర్శకుడు మునుపటి ఫార్మ్ లో లేడు. ఇటీవల ఆయన్నుంచి వచ్చిన 'భారతీయుడు 2' చిత్రం డిజాస్టర్ గా మారడమే కాదు, ట్రోలింగ్ స్టఫ్ గా మారింది. కాబట్టి రామ్ చరణ్ ఫ్యాక్టర్ మీదనే ఈ సినిమాపై జనాల్లో ఆసక్తిని రేకెత్తించాల్సిన అవసరం ఏర్పడింది. నిజానికి 'దేవర' కంటే ముందు కొరటాల శివ 'ఆచార్య' వంటి డిజాస్టర్ అందుకున్నాడు. దీంతో ఎన్టీఆర్ ఒక్కడే సినిమాని తన భుజాన వేసుకొని జనాల్లోకి తీసుకెళ్లాడు. పాన్ ఇండియా వైడ్ గా ప్రమోషన్స్ చేసి సినిమాకి బజ్ తీసుకొచ్చాడు. యావరేజ్ కంటెంట్ అయినా సరే, తన స్టార్ పవర్ తో బాక్సాఫీస్ వద్ద సినిమాని నిలబెట్టాడు. అలానే ఇప్పుడు 'గేమ్ ఛేంజర్' భారాన్ని మొత్తం రామ్ చరణ్ తన భుజాల మీద వేసుకోవాల్సిన అవసరముంది. దూకుడుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. 'దేవర' సినిమాకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ చాలా ప్లస్ అయింది. నాలుగు చార్ట్ బస్టర్ సాంగ్స్ తో పాటుగా అదిరిపోయే బ్యాగ్రౌండ్ స్కోర్ ఇచ్చాడు. ఇవి సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక్కడ 'గేమ్ ఛేంజర్' మ్యూజిక్ విషయానికొస్తే, ఇప్పటి వరకూ రిలీజ్ చేసిన రెండు పాటలు ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. ఎస్. థమన్ రేంజ్ కు తగ్గట్టుగా సాంగ్స్ లేవనే కామెంట్స్ వచ్చాయి. సో ఈ సినిమాకి బజ్ క్రియేట్ అయ్యేలా చూడాల్సిన బాధ్యత చరణ్ మీద ఉంది. అయితే సంక్రాంతికి విడుదల అవుతుండటం 'గేమ్ ఛేంజర్' కు కలిసొచ్చే ప్రధాన అంశం. మామూలుగానే పొంగల్ సీజన్ లో వచ్చే సినిమాలకు టాక్ ఎలా ఉన్నా, ఓపెనింగ్స్ కు డోకా ఉండదు. అదే పాజిటివ్ టాక్ వస్తే మాత్రం రామ్ చరణ్ సినిమాకు బాక్సాఫీస్ వద్ద తిరుగుండదు. ఇప్పటికైతే RRR హీరోలలో భీమ్ హిట్టు కొట్టి మంచి జోష్ లో ఉన్నాడు. మరి రామరాజు ఎలాంటి విజయాన్ని అందుకుంటాడు? భీం మీద పైచేయి సాధిస్తాడా లేదా? అనేది వేచి చూడాలి.

# బాలయ్యతో స్టార్ వారసుల ఫైట్



దాదాపు నలభై ఏళ్లుగా తెలుగు సినిమా రంగంలో తనదైన ముద్రను వేసుకుంటూ బడా హీరోగా దూసుకుపోతోన్నారు నటసింహా నందమూరి బాలకృష్ణ. దీనికితోడు ఈ మధ్య కాలంలో ఆయన వరుసగా హిట్లు మీద హిట్లు కొడుతూ ఫుల్ ఫామ్‌తో ముందుకు వెళ్తున్నారు. ఈ ఉత్సాహంతోనే ఆయన వరుసగా మరిన్ని ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తున్నారు. ఇలా ఇప్పుడు బాలయ్య తన 109వ సినిమాను చేస్తున్నారు. టాలీవుడ్ స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ ఇప్పుడు టాలెంటెడ్ డైరెక్టర్ బాబీ అలియాస్ కేఎస్ రవీంద్ర దర్శకత్వంలో ఓ సినిమాను చేస్తున్నారు. హై ఓల్టేజ్ యాక్షన్‌తో రూపొందుతోన్న ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. అందుకు తగ్గట్లుగానే దీన్ని ఎంతో ఉన్నతంగా తీస్తున్నారు. అంతేకాదు, ఇప్పటికే దీనికి సంబంధించిన షూటింగ్‌ను సైతం చాలా వరకూ కంప్లీట్ చేసుకున్నారు. నందమూరి బాలయ్య – బాబీ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా రాబోతున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ విషయాన్ని ఇటీవలే చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. దీంతో నందమూరి అభిమానులు ఫుల్ ఖుషీ అయిపోతున్నారు. అదే సమయంలో బాలయ్య సంక్రాంతి బరిలో దిగడంపై ఎన్నో రకాల చర్చలు కూడా తెరపైకి వస్తున్నాయి. తెలుగు చిత్ర పరిశ్రమలో సంక్రాంతి సీజన్‌కు ప్రత్యేకత ఉంటుంది. అందుకే ఆ సీజన్‌లో తమ సినిమాలను విడుదల చేసేందుకు హీరోలు, దర్శక నిర్మాతలు ఉత్సాహం చూపుతుంటారు. ముఖ్యంగా పొంగల్ సీజన్‌లో బాలయ్య, చిరంజీవి, నాగార్జున మధ్య పోటీ ప్రత్యేకంగా నిలుస్తోంది. అయితే, ఈ సారి మాత్రం మెగాస్టార్, కింగ్ పోటీ నుంచి తప్పుకున్నారు. కానీ, తమ వారసులను రంగంలోకి దింపుతున్నారు. 2025 సంక్రాంతికి బాలయ్య సినిమాతో పాటు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న 'గేమ్ చేంజర్' కూడా రాబోతుంది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ అనౌన్స్ చేసేసింది. ఈ రెండు చిత్రాలతో పాటు అక్కినేని నాగ చైతన్య హీరోగా నటిస్తోన్న 'తండేల్' కూడా విడుదల కాబోతుందని తెలిసింది. దీనిపై ఈ రెండు రోజుల్లోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుందనే టాక్ వినిపిస్తోంది. మొత్తానికి సంక్రాంతి పోటీని రసవత్తరంగా మార్చేలా బాలయ్యలో స్టార్ హీరోల వారసులైన రామ్ చరణ్, నాగ చైతన్య పోటీ పడబోతున్నారు. ఇవి మాత్రమే కాదు.. విక్టరీ వెంకటేష్ నటిస్తోన్న 'సంక్రాంతికి వస్తున్నాం' కూడా ఇదే సీజన్‌లో విడుదల కానుంది. సంక్రాంతికి చాలా సమయం ఉన్న నేపథ్యంలో ఈ రిలీజ్ డేట్లలో ఏమైనా మార్పులు వస్తాయేమో చూడాలి.

# శివాత్మిక.. నల్లని చీరలో హీటెక్కించే అందం

టాలీవుడ్ సీనియర్ నటుడు రాజశేఖర్ కుమార్తె శివాత్మిక రాజశేఖర్ గ్లామర్ తో కూడా తనదైన శైలిలో గుర్తింపు తెచ్చుకుంటోంది. దొరసాని సినిమాతో హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చిన శివాత్మిక, ఆ సినిమాలో యంగ్ హీరో ఆనంద్ దేవరకొండతో జోడీ కట్టింది. మూవీ కమర్షియల్ గా ఆశించిన రేంజ్ లో సక్సెస్ సాధించకపోయినా, శివాత్మిక తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా ఆమె ఎక్స్ప్రెషన్స్‌కు యూత్ ఫిదా అయిపోయారు. ఆ తర్వాత పంచతంత్రం సినిమాలో కాసేపు కనిపించి మెప్పించింది. రంగమార్తాండలో నెగిటివ్ షేడ్ ఉన్న కూతురు పాత్రలో నటించింది. కృష్ణ వంశీ దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమాలో ఆమె నటన ప్రత్యేకంగా నిలిచింది. సినిమాకు పెద్ద సక్సెస్ రాలేదు కానీ శివాత్మిక నటనకు మాత్రం మంచి మార్కులు పడ్డాయి. ఇక ఆమధ్య వచ్చిన కోటబొమ్మాలి చిత్రంలో సీనియర్ నటుడు



శ్రీకాంత్ సరసన నటిస్తూ మరింత క్రేజ్ సంపాదించుకుంది. తన లక్ష్యం స్టార్ హీరోయిన్ కావడం అని స్పష్టం చేసిన శివాత్మిక, విలక్షణమైన కథలలో మాత్రమే నటించేందుకు మొగ్గు చూపుతోంది. కేవలం లుక్స్ మీదే కాదు, నటనపైన కూడా ఎక్కువ ఫోకస్ చేస్తూ, ప్రాధాన్యమున్న పాత్రలకే ఓకే చెబుతోంది. అయితే సినిమాల కంటే ఎక్కువగా శివాత్మిక తన సోషల్ మీడియా యాక్టివిటీస్ వల్ల మంచి క్రేజ్ పొందుతోంది. లేటెస్ట్ ఫోటోషూట్స్, స్టైలిష్ పిక్స్ షేర్ చేస్తూ, నెటిజన్లను ఫిదా చేస్తోంది. ముఖ్యంగా ఆమె షేర్ చేస్తున్న శారీలో ఫోటోలు ట్రెండింగ్ లో ఉన్నాయి. నల్లని చీరలో ఇటీవల షేర్ చేసిన ఫోటోలలో అమ్మడు అద్దంలో చూస్తూ వయ్యారంగా కనిపించింది. బ్లౌజ్ డిజైన్ కూడా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఇక ఆమె అందంపై ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. మరి రాబోయే రోజుల్లో ఈ బ్యూటీకి ఎలాంటి అవకాశాలు అందుతాయో చూడాలి.

# ఇండస్ట్రీలో లింగ సమానత్వంపై సమంత ఇంట్రెస్టింగ్ కామెంట్స్!

సౌత్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు, బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ "సిటాడెల్: హనీ బన్నీ". ఇటీవలే ఈ సిరీస్ ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ప్రమోషన్స్ లో భాగంగా ముంబైలో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సామ్ పాల్గొంది. ఈ సందర్భంగా ఇండస్ట్రీలో మహిళా ప్రాతినిధ్యం గురించి, లింగ సమానత్వం గురించి మాట్లాడుతూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'సిటాడెల్: హనీ బన్నీ' ప్రెస్ మీట్ లో 'భవిష్యత్తులో సినీ పరిశ్రమలో మహిళల ప్రాధా న్యం ఎలా ఉండబోతోంది?' అని అడిగిన ప్రశ్నకు సమాధానం చెబు తూ.. "ఇండస్ట్రీలో ఆడవారి ఫ్యూచర్ బాగుంది. ఇప్పుడు సమానంగా ఉందని నాకు తెలుసు, కానీ అది లింగ బేధాలు లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించే ప్లేయింగ్ గ్రౌండ్ గా ఉండాలని నేను కోరుకుంటున్నాను. తెలివి, ప్రతిభ, బలాలు.. లింగ భేదం లేకుండా మీ ఫేట్ ని నిర్ణయిస్తాయి. అదే అద్భుతమైన ప్రదేశం అవుతుంది" అని సమంత చెప్పింది. "ఈ ప్లాట్‌ఫారమ్ చాలా విస్తృతమైన అవకాశాలు కల్పిస్తుంది. మహిళల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంది. ఈ ప్రపంచంలో భాగమైనందుకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న విభిన్న వ్యక్తులతో కలిసి పని



చేస్తున్నందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను" అని సమంత తెలిపింది. ఆడ మగ అని తేడా లేకుండా అందరికీ సమానంగా అవకాశాలు రావాలని తాను కోరుకుంటున్నాని చెప్పిన సామ్.. ఇప్పటికే ఇండస్ట్రీలో ఆ మార్పు వచ్చినట్లు చెప్పింది. ఇక 'సిటాడెల్' గురించి మాట్లాడుతూ.. సాధారణంగా స్పై జానర్ లో రూపొందే వెబ్ సిరీస్ లేదా సినిమాలలో ఎప్పుడూ పురుష పాత్రలకే ప్రాధాన్యత ఉంటుంది. వారే యాక్షన్ చేస్తారు.. డైలాగ్స్ చెబుతారు. కానీ దానికి భిన్నంగా ఈ సిరీస్‌లో నేను కొంత మేరకు యాక్షన్ సీన్స్ చేశాను. అవి అందరికీ నచ్చుతాయనే అనుకుంటున్నాను అని సమంత రూత్ ప్రభు చెప్పుకొచ్చింది. రాజ్ – డీకే దర్శకత్వంలో "సిటాడెల్: హనీ బన్నీ" సిరీస్ రూపొందింది. ప్రియాంక చోప్రా, రిచర్డ్ మ్యాడెన్ ప్రధాన పాత్రలో రూసో బ్రదర్స్ తీసిన సిటాడెల్ సిరీస్ కు ఇండియన్ వెర్షన్ ఇది. గూఢచర్యం నేపథ్యంలో సాగే ఈ సిరీస్ లో.. వరుణ్ ధావన్, సమంత ఇద్దరూ స్పై ఏజెంట్ లుగా కనిపించనున్నారు. ఇందు లో యాక్షన్ సీన్స్ కోసం సామ్ ప్రత్యేకంగా ట్రైనింగ్ తీసుకుంది. ఇటీవలే రిలీజైన ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో నవంబర్ 7వ తేదీ నుంచి అన్ని భారతీయ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. రాజ్ – డీకే తెరకెక్కించిన 'ఫ్యామిలీ మ్యాన్–2' వెబ్ సిరీస్ తో సమంత ఓటీటీలో అడుగుపెట్టింది. ఇందులో రాజీ అనే నెగెటివ్ షేడ్స్ ఉన్న బోల్డ్ పాత్రలో నటించి ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు 'సిటాడెల్: హనీ బన్నీ' వంటి యాక్షన్–ప్యాక్డ్ సిరీస్ లో అలరించడానికి వస్తోంది. మరి ఈ స్పై సిరీస్ సామ్ కు ఎలాంటి గుర్తింపు తెచ్చిపెడుతుందో చూడాలి. ఇక సినిమాల విషయానికొస్తే, చివరగా 'ఖుషి' లో కనిపించింది. తన హోమ్ బ్యానర్ లో 'మా ఇంటి బంగారం' అనే పాన్ ఇండియా చిత్రాన్ని ప్రకటించింది.




## ఆ భారత దౌత్యవేత్తలపై నిఘా ఉంచాం: మరోసారి కెనడా దురుసు వ్యాఖ్యలు

భారత్‌తో దౌత్యసంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతింటున్నా కెనడా వైఖరిలో మాత్రం ఎలాంటి మార్పులేదు. ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో మాటల్నే విదేశాంగమంత్రి మెలానీ జోలీ వల్లెవేశారు. అక్కడున్న మిగిలిన దౌత్యవేత్తలపై నిఘా ఉంచామంటూ భారత్‌పై బురదజల్లే ప్రక్రియను కొనసాగించారు. అంతటితో ఆగకుండా భారత్‌ను రష్యాతో పోలుస్తూ అక్కసు వెళ్లగక్కారు. వియన్నా కన్వెన్షన్ ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడితే సహించేది లేదని మెలానీ వ్యాఖ్యలు చేశారు. సిక్కుల అతివాద నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకేసు అనుమానితుల జాబితాలో ఏకంగా భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మను చేర్చింది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య అగ్గిరాజేసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన్ని, మరికొందరు అధికారుల్ని అక్కడి నుంచి వెనక్కి తెచ్చేయాలని కేంద్రం నిర్ణయించింది. దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించింది. ప్రతిగా కెనడా సైతం అదే తరహా నిర్ణయం తీసుకుంది. ఇలా ఉద్రిక్తతలు కొనసాగుతోన్న తరుణంలో మెలానీ మాట్లాడుతూ రష్యా, భారత్ మధ్య పోలిక తెచ్చారు. "మా దేశ చరిత్రలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. అంతర్జాతీయ శక్తులు కెనడా గడ్డపై ఇలాంటి అణచివేతకు పాల్పడటాన్ని మేం జరగనివ్వబోం. ఐరోపాలో ఇలాంటివి మేం చూశాం. జర్మనీ, యూకేలో రష్యా ఆ పనిచేసింది. ఇలాంటివాటికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడాల్సి ఉంది" అని జోలీ వెల్లడించారు. కెనడాలో మిగిలిన భారత దౌత్యవేత్తలను కూడా బహిష్కరిస్తారా ? అని అడగ్గా.. "వారిపై నిఘా ఉంచాం. ఒట్టవా హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తలను బహిష్కరించాం. మిగిలినవారు వాంకోవర్, టొరంటోలో ఉన్నారు. వియన్నా కన్వెన్షన్‌కు విరుద్ధంగా వ్యవహరించే దౌత్యవేత్తలను మేం సహించబోం" అంటూ వ్యాఖ్యలు చేశారు. నిజ్జర్ హత్యకేసులో భారత్ ఏజెంట్ల ప్రమేయం ఉందంటూ గతేడాది ట్రూడో చేసినప్పటినుంచి రెండు దేశాల సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే కేవలం నిఘా సమాచారం ఆధారంగా అప్పుడు భారత్‌పై ఆరోపణలు చేశానని, ఆ సమయంలో ఎటువంటి ఆధారాలు లేవని ట్రూడో ఇటీవల అంగీకరించిన సంగతి తెలిసిందే. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. భారత్‌పై నిందలు వేస్తున్న విషయం ఆయన మాటల్లోనే తేటతెల్లమైందని మండిపడింది. అయినా కూడా ట్రూడో తన వ్యాఖ్యలను కొనసాగించారు. కెనడియన్లకు సంబంధించిన సమాచారాన్ని భారత దౌత్యవేత్తలు సేకరించారని, వాటిని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు అందజేశారని మరోసారి ఆరోపించారు.



## నివేదిక తర్వాతే.. రైతు భరోసా పథకం అమలు : మంత్రి తుమ్మల

హైదరాబాద్ : తెలంగాణ మంత్రివర్గ ఉపసంఘం నివేదిక వచ్చిన తర్వాత రాబోయే సీజన్ నుంచి రైతుభరోసా పథకం అమలు చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ బీఆర్కేఆర్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో రైతు బీమా, రుణ మాఫీ, రైతు భరోసా, ధాన్యం, పత్తి, ఇతర పంటల కొనుగోళ్లు కనీస మద్దతు ధర, ఇతర వ్యవసాయ అంశాల గురించి మంత్రి మాట్లాడారు. మంత్రివర్గ ఉపసంఘం నివేదిక రాగానే రాబోయే పంట కాలం నుంచి రైతులకు ఎకరాకు రూ.7500 సాయం అందిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతు కుటుంబాలను గుర్తించి డిసెంబరులోగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తామన్నారు. అదేవిధంగా రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న, నిర్ధరణ కాని రైతు కుటుంబాల కోసం త్వరలో షెడ్యూల్ ప్రకటించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇస్తున్నామన్నారు. పంట బీమా పథకం వచ్చే సీజన్ నుంచి అమలు చేస్తామని వెల్లడించారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కే అన్ని పంటలను కొనుగోలు చేస్తున్నప్పటికీ... ప్రస్తుతం 25 శాతం మాత్రమే తీసుకుంటుందని కేంద్రం చెప్పారు. పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కేంద్రానికి లేఖ రాశామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, టీజీ సీడ్స్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, రైతు సంఘాల నేతలు సారంపల్లి మల్లారెడ్డి, పశ్య పద్మ, నల్లమల వెంకటేశ్వరరావు, లోకసాని పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మూసీ పక్కన మూడేళ్లు ఉండేందుకు సిద్ధమే : కేటీఆర్



హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకునేందుకు పేదల కడుపు కొట్టి దిల్లీకి మూటలు మోస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోంది మూసీ బ్యూటిఫికేషన్ కాదని, లూటిఫికేషన్ అని ఆరోపించారు. నాగోల్‌లోని మురుగు శుద్ధి కేంద్రాన్ని (ఎస్టీపీల)మాజీ మంత్రులు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన పరిశీలించారు. రూ.386 కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం 31 ఎస్టీపీలను నిర్మించేందుకు సిద్ధమైందని గుర్తు చేశారు. వారసత్వ సంపదలను కాపాడుతూనే అభివృద్ధి చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందని స్పష్టం చేశారు. రూ.545 కోట్లతో 15 బ్రిడ్జిలు నిర్మించిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. మూసీ నిర్వాసితులకు ఇస్తున్న ఇళ్లు కూడా కేసీఆర్ నిర్మించిన రెండు పడక గదులేనని తెలిపారు. ఇటీవల తనను మూసీ పక్కన మూడు నెలలు ఉండాలని రేవంత్ చేసిన సవాల్‌పై స్పందించిన కేటీఆర్.. మూడేళ్ల పాటు ఉండేందుకు సిద్ధమేనన్నారు. దమ్ముంటే మూసీ నదీ లోతు పెంచి, బలమైన కోల్‌కతా లాంటి నగర నిర్మాణం చేయాలని సూచించారు. సరైన డీపీఆర్ లేకుండా ముందుకెళ్లడం మూర?త్వం అవుతుందని హితవు పలికారు. మూసీ బాధితులకు భారాస అండగా ఉంటుందని, వారి తరఫున న్యాయపోరాటం చేస్తుందన్నారు.

## ఆ రాష్ట్రాల ఎన్నికలకు కేసీఆర్ డబ్బులు పంపింది వాస్తవం కాదా కేటీఆర్?: బండి సంజయ్

హైదరాబాద్: హరియాణా, కశ్మీర్ ఎన్నికలకు కాంగ్రెస్ ఖర్చు చేసిన డబ్బు భారాసదే అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ట్వీట్‌కు ఆయన కౌంటర్ ఇస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ అహంకారమే భారాస పరిస్థితికి కారణమన్నారు. ఆయన వల్లే కేసీఆర్ సర్వనాశనం అయ్యారని మండిపడ్డారు. "కాంగ్రెస్, భాజపా ఒకటి కానే కాదు. అసలు దోస్తాన్ కేసీఆర్, కాంగ్రెస్ మధ్యనే ఉంది. హరియాణా, కశ్మీర్ ఎన్నికలకు కేసీఆర్ డబ్బులు పంపింది వాస్తవం కాదా కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం విచారణలు ఏమయ్యాయి? ట్యాపింగ్‌లో కేసీఆర్‌కు 41 సీఆర్‌పీసీ నోటీసులు ఎందుకు ఇవ్వడం లేదు?" అని బండి సంజయ్ ప్రశ్నించారు.



## గ్రూప్-1 అభ్యర్థుల డిమాండ్ న్యాయమైంది.. సీఎం స్పందించాలి: బండి సంజయ్

హైదరాబాద్: జీవో 29 వెనుక రిజర్వేషన్లు రద్దు చేసే కుట్ర దాగి ఉందని అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో శనివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకే మోదీ ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తెచ్చింది. జీవో 29 వల్ల అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందనేది వాస్తవం. గ్రూప్-1 రద్దు చేయాలని ఎవరూ అడగట్లేదు, వాయిదా వేయాలని మాత్రమే కోరుతున్నారు. భారాస ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోంది. పరీక్ష పూర్తయిన తర్వాత కోర్టు రద్దు చేస్తుందనే భయం అభ్యర్థుల్లో ఉంది. సోనియాగాంధీ జన్మదినం రోజున ఇంకా ఎంతమందిని బలి తీసుకుంటారో తెలియదు. గ్రూప్-1 అభ్యర్థులపై రోజూ లాఠీఛార్జి జరుగుతోంది. వారిది న్యాయమైన డిమాండ్. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలి. సమస్యను పరిష్కరించేందుకు ఆలోచించాలి కానీ, ప్రభుత్వం మొండిపట్టుతో వ్యవహరించడం మంచికాదు. నిరుద్యోగుల ఆందోళనపై భారాస పెద్ద కుట్ర చేసింది. మా ర్యాలీలో చొరబడి విధ్వంసాలకు పాల్పడాలని చూస్తే నిరుద్యోగ యువత అడ్డుకున్నారు. మా పార్టీ కార్యకర్తలతో గొడవకు దిగారు" అని బండి సంజయ్ వివరించారు.

## కేటీఆర్‌పై ఘాటు వ్యాఖ్యలతో విరుచుకుపడ్డ మంత్రి



హైదరాబాద్, అక్టోబర్ 19: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... కాళేశ్వరం, మిషన్ కాకతీయ, భగీరథ ఇంకా ఏవో పేర్లు చెప్పి 7 లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. "మాకు పదేళ్ల కింద 25 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే సమస్య పరిష్కారం అయ్యేది? వాడు(కేటీఆర్) తలకాయ ఉండి మాట్లాడుతున్నారా. వంద అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు. అరె పిచ్చి కేటీఆర్.. చేసేదే చెప్పాము. మీలాగా అమలు కానీ హామీలు ఇవ్వలేదు. ఎంత కష్టం అయినా నెల మొదటి రోజే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నాం. కేటీఆర్, హరీష్‌కు ఏం పుట్టింది మీకు రాజకీయాలు వస్తాయా.. అసెంబ్లీ, పార్లమెంట్ లో ఓడిపోయిన బీఆర్‌ఎస్ వాళ్ళు వేరే దేశానికి వెళ్లి బ్రతుకుతారు అనుకున్నా.. కానీ సిగ్గు లేకుండా రోడ్ల మీద తిరుగుతున్నారు" అంటూ ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. నల్గొండలో అనారోగ్యం బారిన పడిన వారు చాలా మంది ఉన్నారని.. ఎన్నో వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎస్టీపీలతో సమస్య పరిష్కారం కాదని.. స్వచ్ఛమైన నీరు ఇవ్వాలని మంత్రి తెలిపారు.

**సీఎంను అభినందిస్తున్నా..** ఫ్లోరైడ్ కు శాశ్వత పరిష్కారం ఎస్‌ఎల్‌బీసీ అని తెలిపారు. ఎస్‌ఎల్‌బీసీ, మూసీ శుద్ధీకరణ విషయంలో ముఖ్యమంత్రిని అభినందుస్తున్నట్లు తెలిపారు. ఒక వైపు ఫ్లోరైడ్, మరోవైపు కోటిన్నర మంది వాడిన నీరు నల్గొండలో పారుతోందన్నారు. గత ప్రభుత్వం ఎస్‌ఎల్‌బీసీలో 5 వేల కోట్లు దోచుకుతిన్నారని మండిపడ్డారు. కేసీఆర్ కొడుకు అంటే గుర్తు పడతారు కానీ.. కేటీఆర్ అంటే ఎవరూ గుర్తు పట్టరంటూ వ్యాఖ్యలు చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌కు నేను సిద్ధం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్: మూసీ సుందరీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌కు తాను సిద్ధమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మూసీ ప్రక్షాళన వ్యతిరేకించే బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు మూడు నెలలపాటు ఆ ప్రాంతంలో నివాసం ఉంటే సుందరీకరణ అంశాన్ని పక్కనపెడతానని రేవంత్ రెడ్డి సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు తాను రేవంత్ రెడ్డి సవాలును స్వీకరిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. మూడు నెలలపాటు తాను నివాసం ఉంటానని, మరి ఇందుకు సీఎం సిద్ధమేనా అని ప్రశ్నించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. " మూసీ ప్రాంతంలో నివాసం ఉండటానికి నేను సిద్ధం. ముఖ్యమంత్రి సిద్ధమేనా?. సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు నేను మూడు నెలలపాటు మూసీ ప్రాంతంలో నివాసం ఉంటాను. నది శుద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదు. పేదల ఇళ్లు కొడితే బీజేపీ ఊరుకోదు. బీఆర్‌ఎస్ నేత కేటీఆర్‌తో నీతులు చెప్పించుకునే స్థితిలో మేము లేము. మూసీ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్, బీఆర్‌ఎస్‌కు లేదు. నది సుందరీకరణకు తెరతీసిందే బీఆర్‌ఎస్ ప్రభుత్వం. ప్రజలు తిరగబడటంతో అప్పటి ప్రభుత్వ పెద్దలు తోక ముడిచారు. చేతనైతే మూసీలో వ్యర్థాలు కలవకుండా రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలి. నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ కడితే వరదల నుంచి కాపాడుకోవచ్చు. ప్రజలు కోరుకోనప్పుడు మూసీ సుందరీకరణ ఎందుకు?. నదీ పరివాహక ప్రాంత ప్రజల తరుఫున బీజేపీ పోరాడుతోంది. వారి ఇళ్లు కూలుస్తామంటే ఒప్పుకునేది లేదు. మూసీ నిర్వాసితులకు అండగా ఉంటాం. వారి తరఫున పోరాడుతాం. అడ్డగోలుగా వచ్చి ఇళ్లపై పడితే చూస్తూ ఊరుకోం" అని అన్నారు.

## బావ బామ్మర్దుల తీరు ఈస్టమన్ కలర్ లాగా ఉంది



హైదరాబాద్, అక్టోబర్ 19: రాష్ట్రంలో హైడ్రా అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుంది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయడంతోపాటు జీవో 29 రద్దు చేయాలంటూ అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. అలాంటి వేళ.. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీల అగ్రనేతల మధ్య మాటల యుద్ధం వాడి వేడిగా కొనసాగుతుంది. ఆ క్రమంలో ఎక్సైజ్ శాఖా మంత్రి జూప్లలి కృష్ణారావు శనివారం గాంధీ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ అగ్రనేతలు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులపై వ్యంగ్య బాణాలు సంధించారు. అందులోభాగంగా హరీశ్‌రావుకు జూపల్లి బంపర్ ఆఫర్ ఇచ్చారు. హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వస్తానని సవాల్ చేస్తున్నాడన్నారు. అయితే హరీశ్ రావు సవాల్‌ని తాను స్వీకరిస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. హారీశ్‌రావు సవాల్‌కు సీఎం రేవంత్ రావాల్సిన అవసరం లేదన్నారు. తాను ఈ చర్చకు వస్తానని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ఆదాయం ఎంత? అవినీతి ఎంత? నాడు అప్పు ఎంత? ఎవరెవరు ఎంత దోచుకున్నారో అంతా చర్చిద్దామని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. నగరంలోని లాల్‌బహదూర్ స్టేడియం వేదికగా మీడియా సమక్షంలో 50 వేల మంది ప్రజలు చూసే విధంగా ఈ అంశంపై చర్చిద్దామని బీఆర్‌ఎస్ నేతలకు జూపల్లి సవాల్ విసిరారు. తన వద్ద అన్ని ఆధారాలున్నాయని చెప్పారు. మీ అవినీతి, అక్రమాలు, దోపిడికి సంబంధించిన అన్ని అంశాలను తాను రుజువు చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి.. ఢిల్లీలోని పార్టీ పెద్దలకు కప్పం కడుతున్నాడంటూ ఆరోపణలు చేస్తున్నారు.. మరి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్.. ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన నగదు ఎక్కడి నుంచి వచ్చిందని జూపల్లి ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ పెద్దలను ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యే కాకుండా.. హరీశ్ రావు మంత్రి అయి డ్యాన్స్ వేశాడని గుర్తు చేశారు. హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో మూసి రివర్ ఫ్రంట్‌లో యాభై వేల కోట్ల దోపిడి జరిగిందంటూ తెలంగాణ ప్రజలను కేటీఆర్, హరీశ్ రావులు తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్,హరీశ్‌రావులు.. తాము నీతి మంతులమని అంటున్నారని గుర్తు చేశారు. బావ బామ్మర్దుల తీరు ఈస్టమన్ కలర్‌లాగా ఉందంటూ జూపల్లి వ్యంగ్యంగా పేర్కొన్నారు. తెలంగాణను మొత్తం దోచుకుంది వాళ్లేనంటూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఫ్యామిలీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ బీఆర్‌ఎస్ నేతలు రాజకీయంగా దివాళా తీశారని.. దాంతో వాళ్ళను పట్టించుకోవాల్సిన అవసరం అయితే లేదని ప్రజలకు ఈ సందర్భంగా మంత్రి జూపల్లి సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టను దిగజార్చడానికి హరీశ్ రావు, కేటీఆర్‌లు ఈ విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. పది నెలలు అయినా ఇంకా ఓటమిని వాళ్ళు అంగీకరించినట్లు ఎక్కడ కనపడట్లేదంటూ కేటీఆర్, హరీశ్ రావు వ్యవహారశైలిపై జూపల్లి మండిపడ్డారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2016లో మూసి ఒడ్డు నుంచి 50 మీటర్లు బఫర్ జోన్‌గా పేర్కొంటూ జీవో నెం.7 జారీ చేసిందని చెప్పారు. ఈ 50 మీటర్ల బఫర్ జోన్‌లో తన ఇల్లు సైతం ఉందని.. అది పోతుందని జూపల్లి పేర్కొన్నారు. గతంలో హైదరాబాద్‌ను డల్లాస్, లండన్, ఇస్తాంబుల్ చేస్తానంటూ బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అలాగే హుస్సేన్ సాగర్‌లో నీళ్లను.. కొబ్బరి నీళ్లు తాగేటట్లు చేస్తా చెప్పారన్నారు.

ఆ క్రమంలో హైదరాబాద్‌ను మార్చాలన్న కేసీఆర్ మాటలను తాము స్వాగతిస్తున్నామన్నారు. ఏదీ ఏమైనా మూసీ రివర్ ఫ్రంట్ మాత్రం అభివృద్ధి కావాల్సిందేనని.. అలాగే మురికి కూపం నుంచి పేదలకు విముక్తి కలిపించాల్సిందేనని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.

## ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోం.. గ్రూప్1 అభ్యర్థులకు డీజీపీ వార్నింగ్



హైదరాబాద్, అక్టోబర్ 19: రాష్ట్రంలో గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. మరోవైపు జీవో 29ను రద్దు చేయాలంటూ నిరుద్యోగుల ఆందోళనలు మిన్నంటాయి. పలు చోట్ల నిరుద్యోగులు నిరసనలకు దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు డీజీపీ జితేందర్ వార్నింగ్ ఇచ్చారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... గ్రూప్ 1 పరీక్షల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్ల మీదికి వచ్చి సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకోమని స్పష్టం చేశారు. శాంతిభద్రతలను రక్షించాలనే నిన్న (శుక్రవారం) వారి (గ్రూప్ -1 అభ్యర్థులు) ఆందోళన అరికట్టామని అన్నారు. సమస్య పరిష్కారానికి సుప్రీం కోర్టు కు వెళ్లాలి కానీ రోడ్ల మీద ఆందోళన చేస్తే ఊరుకోమంటూ డీజీపీ జితేందర్ హెచ్చరించారు.

**అశోక్‌నగర్‌లో తీవ్ర ఉద్రిక్తత...** మరోవైపు నగరంలోని అశోక్‌నగర్‌లో ఉద్రిక్తత నెలకొంది. జీవో నెంబర్ 29 రద్దు కోసం నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. జీవో నెంబర్ 29ని రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. నిరుద్యోగుల ఆందోళనకు కేంద్రమంత్రి బండి సంజయ్ మద్దతు పలికారు. జీవో నెం 29ను రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలంటూ నిరుద్యోగ యువతీయువకులు ఇచ్చిన ఆందోళనకు నిరుద్యోగ యువతతో పాటు బీజేపీ పార్టీ శ్రేణులు కూడా తరలివచ్చారు. అశోక్‌నగర్ నుంచి ఛలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చారు. నిరుద్యోగుల ఆందోళనకు మద్దతు ఇచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్.. పెద్దఎత్తున నిరుద్యోగులతో కలిసి సెక్రటేరియట్ ముట్టడికి బయలుదేరారు. వీరిని అడ్డుకునేందుకు పోలీసులు శతవిధాలుగా ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఎట్టిపరిస్థితుల్లోనూ సెక్రటేరియట్ ముట్టడి చేస్తామని బండిసంజయ్ స్పష్టం చేశారు. అశోక్‌నగర్ నుంచి వందలాది మంది యువతీ యువకులు సెక్రటేరియట్ ముట్టడికి బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. జీవో నెం 29పై ప్రభుత్వం సరైన నిర్ణయం ప్రకటించని నేపథ్యంలో సర్కార్ వైఖరికి నిరసనగా తమ ఆందోళన కొనసాగుతుందని నిరుద్యోగులు స్పష్టం చేస్తున్నారు. ఓ వైపు నిరుద్యోగులు, మరోవైపు బీజేపీ పార్టీ శ్రేణుల ఆందోళనతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పెద్ద ఎత్తున పోలీసులు కూడా అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపుచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీసులకు, బండి సంజయ్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సెక్రటేరియట్‌ను ముట్టడి చేసే వరకు వెనక్కి తగ్గేది లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అల్టిమేటం జారీ చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com